ప్రసంగ వ్యాసాలు

డా॥ జి. లలిత

1983

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్ - హైదరాబాద్

ప్రసంగ వ్యాసాలు

డా॥ జి. లలిత

1983

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్ - హైదరాబాద్

ప్రసంగ వ్యాసాలు

ప్రథమ ముద్రణ : 1983

ప్రతులు : 1000

వెల : రూ. 2/-

ప్రచురణ :
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు, హైదరాబాదు.

ముద్రణ :
పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్
హైదర్‌గూడ, హైదరాబాదు.

తొలిపలుకు

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహించే ముఖ్యమైన కార్యక్రమాలలో ప్రసిద్ధ పండితులతో తెలుగు సాహిత్యాలకు సంబంధించిన విషయాలపైన ఉపన్యాసాలను ఏర్పాటు చేయటం ఒకటి. అందులో భాగంగానే 1982 సంవత్సరం మార్చి 2, 3 తేదీలలో వరుసగా 'చాటువులు సాంఘిక జీవన ప్రతిఫలనము,' 'తెలుగు వ్యాకరణాలలో ప్రయోగ ప్రదర్శన' అనే అంశాలపైన డా॥ జి. లలితగారు ప్రసంగించారు. ఆ ప్రసంగ వ్యాసాలను పుస్తక రూపంలో ప్రస్తుతం అందజేస్తున్నాము.

డా॥ జి. లలితగారు మద్రాసులోని ప్రెసిడెన్సీ కళాశాల తెలుగు శాఖలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. కోరగానే మా సారస్వత పరిషత్తు వేదికపైన ప్రసంగించి, ఆ ప్రసంగ వ్యాసాలను లిఖిత రూపంలో కూడా అందజేసినందుకు వారికి మా కృతజ్ఞతలు. ఈ పుస్తకం పండితులకు, విద్యార్థులకు ఉపయోగకారి కాగలదని ఆశిస్తున్నాము.

1-11-1983
తిలక్‌రోడ్
హైదరాబాద్

ఇట్లు
కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

మా మాట

తెలుగు భాషా సాహిత్యాలకు, చరిత్రకు సంబంధించిన విషయాలపై ప్రసిద్ధ పండితులచేత ఉపన్యాసాలు ఇప్పించటం, ఆ ఉపన్యాసాలను పుస్తక రూపంలో ప్రకటించటం ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహించే కార్యక్రమాలలో ప్రధానమైన భాగం. అట్లా వెలువడిన గ్రంథాలే 'ఆంధ్ర మహా భాగవతోపన్యాసములు', 'ఆంధ్ర మహాభారతోపన్యాసములు' 'తెలుగులో పదకవిత', 'కాకతీయ శాసన సాహిత్యము' మొదలైనవి. ఈ పరంపరలోనే 'ప్రసంగ వ్యాసాలు' అనే గ్రంథాన్ని పరిషత్తు వెలువరిస్తున్నది. 1982 మార్చి 2,3 -తేదీలలో మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల తెలుగు శాఖకు చెందిన ఆచార్య జి. లలితగారు చేసిన ప్రసంగ వ్యాసాల సంకలనం ఇది. 'చాటువులు - సాంఘిక జీవన ప్రతిఫలనము', 'తెలుగు వ్యాకరణాలలో ప్రయోగ ప్రదర్శన' అనే రెండు ప్రసంగ వ్యాసాలు ఇందులో ఉన్నాయి. జి. లలితగారు తెలుగు సాహిత్యంలోను, వ్యాకరణంలోను చేసిన కృషికి ఈ రెండు ప్రసంగ వ్యాసాలు తార్కాణాలు. ఉపన్యాసాలు ఇవ్వటమే కాకుండా, ఉపన్యాస వ్యాసాలను ప్రచురణ కోసం మాకంద జేసిన జి. లలితగారికి, ఈ గ్రంథాన్ని అందంగా ముద్రించిన పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్ వారికి మా ధన్యవాదాలు.

కార్యదర్శి

హైదరాబాదు — ఆంధ్ర సారస్వత పరిషత్తు

చాటువులు—
సాంఘిక జీవన ప్రతిఫలనము

—ఆచార్య జి. లలిత

చాటువులు - సాంఘిక జీవన ప్రతిఫలనము

నిర్వచనం : 'చాటువు' అంటే ప్రియమైనమాట. దీనికి రాజాది స్తుతి వాక్యం, మిథ్యా ప్రియవాక్యం మొదలైన అర్థవిశేషాలున్నాయి. కవులు ఒకానొక సందర్భంలో ఆశువుగ, చమత్కార జనకంగ, మనో రంజకంగ, ముక్తక రూపంలో చెప్పితే, అది ఆనోట ఈనోట పరం పరాగతంగ నిలిచివున్న పద్యం చాటువుగ చెలామణి అవుతున్నది. చాటు పద్యాలలో చమత్కార జనకత్వం ముఖ్యలక్షణం.

ఈకాలంలో ప్రజల కాలక్షేపానికి సినిమాలు, టి.వీ.లు, రేడియోలు ఇంకా పలురకాలైన ఆధునిక సాధనాలున్నవి. పూర్వం ఇవేవీలేని కాలంలో నాగరకులు సాయంవేళల్లో, ఉద్యానవనవాటికల్లోనో, సంపన్న గృహస్థుల ఇండ్లలోనో చేరి మధుమైరేయాదులను సేవిస్తూ సంగీత సాహిత్యగోష్ఠితో కాలక్షేపం చేసేవారు. అక్కడ ప్రహేళికా, మాత్రాచ్యు తక, బిందుచ్యుతక సమస్యా పూరణకాలనే కావ్య వినోదాలు జరిగేవి. రాజసభల్లో కావ్యగోష్ఠులు జనరంజకంగ ఉండేవి. భోజరాజు సభలో దండి; కాళిదాసాది కవీశ్వరులు పోటీలతో ఆశు, చిత్రకవితలల్లి ఆ ప్రభు వతంసుని మెప్పించి అక్షర లక్షలు, అగ్రహారాలు అందుకున్నట్లు చరిత్ర చెప్పుతుంది. ఇలా రాజసన్మానితులు, రాజపూజితులు అయిన కవి పండితులు దేశంలో సుప్రసిద్ధులు కావడమన్నది మన దేశంలో అనాదిగ ఉన్న ఆచారం. సంస్కృతాంధ్రభాషల్లో ఇలా కావ్యరచనతోపాటు చాటువులూ వెలువడుతూ వచ్చాయి.

1. చాటువుల్లో వినటానికి, చదవటానికి ఇంపు పుట్టించే చిత్ర విచిత్రాలు, సరసాలు, వివిధ వర్ణనలు అనేకం ఉన్నాయి. విజ్ఞాన దాయకాలు, నీతి ధైర్యోత్సాహ సంధాయకాలు, భక్తి జ్ఞాన వైరాగ్య బోధకాలు అయిన చాటువులే కాక, వ్యక్తుల పరస్పర స్పర్థలు, ఈర్ష్యాసూయలు, జిగీష నిందా శాపాలతో కూడిన చాటువులు ఎన్నో ఉన్నాయి. మచ్చుకు సంస్కృత చాటువులు మూడింటిని ఉదాహరిస్తాను. చమత్కరించడం చాటువుయొక్క ప్రధానగుణం.

సంసారంలో మామగారి గృహం తప్ప తక్కినదంతా అసారమట అందుచేతనే హరిహరులు మామగారి ఇండ్లలోనే కాపురం పెట్టారు.

అసారే ఖలు సంసారే
సారం శ్వశుర మందిరమ్
హిమాలయే హరశ్శేతే
హరిశ్శేత మహోదధౌ.

హాస్యం చాటువుకు జీవం. మహాప్రాణాక్షరాల ఉచ్చారణలో తడబడేవాళ్లను ఉద్దేశించి, పరిహసిస్తూ చెప్పిన చాటువు:

కుంభకర్ణే భకారోస్తి
భకారోస్తి విభీషణే
అగ్రజశ్చ స్వయంరాజా
రాభణో న చ రావణః.

ఒక గయ్యాళి ఇల్లాలి పోరును చమత్కరించిన చాటువు:

మశకా మత్కుణా రాత్రే
మక్షికా భిక్షుకా దివా

పిపీలికాశ్చ భార్యా చ
దివారాత్రం ప్రబాధతే.

2. వర్గీకరణ :- తెలుగులో లభిస్తున్న వేలాది చాటువులు వివిధ విషయ ప్రధానాలు. వీటిలో స్తుతి, నిందా రూపంలోనివి మాత్రమే కాకుండా రాజుల చరిత్రలు, మంత్రుల తంత్రాలు, కవుల వివాదాలు, శృంగార ఘట్టాలు, హాస్య ప్రసంగాలు, ఊళ్ళు నాళ్ళు, చలి, పొగాకు, నస్యం, నల్లి మొదలైన సామాన్య విషయాలను పురస్కరించుకొని చెప్పిన చాటువులు చాల ఉన్నాయి. వీటి వింగడింపు కొంత కష్టమైనదే. అయినప్పటికీ తెలుగు చాటువులను స్థూలంగ ఈ క్రింది విధంగ వర్గీకరింపవచ్చు- 1. భూషణ (స్తుతి) చాటువులు. 2. దూషణ (తిట్టు) చాటువులు. 3. వర్ణనాత్మక చాటువులు 4. పాండితీ ప్రదర్శక చాటువులు. 5. సమస్యా పూరణ చాటువులు. 6. శృంగార హాస్యరసస్ఫోరక చాటువులు. 7. చమత్కార చాటువులు. 8. చిత్ర కవితా విలసిత చాటువులు. 9. సాహితీ విమర్శనాత్మక చాటువులు. 10. సంవాదాత్మక చాటువులు. 11. అర్జీలు-విన్నపాలు 12. నీతి, తాత్త్విక చింతనతోకూడిన చాటువులు. 13. భారతాది పౌరాణిక గాథలు. 14. స్మృతి చాటువులు. 15. పొడుపు కథలు-చిత్ర ప్రశ్నలు. 16. సంకీర్ణ చాటువులు. ప్రస్తుతం ఈ వివిధ చాటువుల విన్నాణాలను వివరించడంలేదుగాని ఈ చాటువుల్లో ప్రతిఫలించిన సాంఘికజీవనాన్ని గూర్చి ముచ్చటించబోతున్నాను.

3. సాంఘిక జీవన దర్పణం :- సాహిత్యం జీవితానికొక మహాభాష్యం వంటిదని Mathew Arnold పేర్కొన్నాడు. సాహిత్యానికి సంఘానికి గల బింబ ప్రతిబింబ భావం సహృదయ హృదయైక వేద్యం.

తెలియచెప్పు - చరిత - తేదీలు మాత్రమే !
చెప్పలేదు గుండె విప్పిచూపి;
పెద్దపెద్ద నిలువుటద్దాల మేడయై
వాఙ్మయమ్మె - చరిత - ప్రతిఫలించు

అన్నారు డా॥ నండూరి రామకృష్ణమాచార్యగారు. సాహిత్యంలో ఒక ప్రక్రియ అయిన చాటువులు గతించిన ఆంధ్రుల జీవన విధానానికి కరదీపికలు. సాంఘిక చరిత్ర అంటే అసలు ప్రజల చరిత్ర. అది సామాన్యుల సొంతకథ. మన పూర్వుల తిండి తీర్థాలు, కట్టుబొట్లు, ఇండ్లు వాకిండ్లు, ఆటపాటలు, ఆచార వ్యవహారాలు, వృత్తివ్యాపారాలు, అలంకార ఆభరణాలు, చదువుసంధ్యలు, పండగలు పబ్బాలు, పల్లెలు పట్టణాలు, వారు పడిన పాట్లు, ముందు తరాలవాళ్లు వెనుక తరాల వారికి మిగిల్చిపోయిన మంచి చెడ్డలు, ఇవన్నీ తెలుసుకోవడమే సాంఘిక చరిత్ర.

అంబర చుంబిత భవనాలను, పట్టు పీతాంబరాలను, ఇష్టమృష్టాన్నాలను, గంధర్వగానాలను, హంస తూలికాతల్పాలను చిగురాకు పాన్పులను, విరహ గీతాలను తెలుగు కావ్యప్రబంధాలు చిత్రించాయి. కాని ప్రజాజీవనాన్ని ప్రదర్శింపలేదు అన్న విమర్శ ఉన్నది. ప్రాచీన తెలుగు సాహిత్యంలో సాంఘిక చరిత్ర సంబంధి రచనలు లేవన్న కొరతను కొంతవరకు తెలుగు చాటువులు తీర్చాయి. చాటుకవులు ప్రజాజీవనాన్ని చిత్రించిన ప్రజాకవులు.

4. ఆకరాలు: తెలుగులో చాటువులు ఆదికాలంనుండి (11వ.శ.) ఉన్నట్లు తెలుస్తున్నది. కాని 12 వ శతాబ్దినుండే వేములవాడ భీమన చాటువులు లభిస్తున్నాయి. సుప్రసిద్ధ కవులందరు ఎప్పుడో ఒకప్పుడు ఒకటో, రెండో చాటువులు చెప్పినవారే. చాటువులు చెప్పిన కవయిత్రులు

కూడ ఉన్నారు. కాని ప్రతి శతాబ్దంలో అందరూ చెప్పిన అన్ని చాటువులు లభించడంలేదు. గ్రంథస్థమైన సాహిత్యాన్నే మనం రక్షించుకోలేదు. ముఖస్థమై లోకుల నాల్కలపై నిలిచిన చాటువులు నశించడంలో ఆశ్చర్యం లేదు. అందుచేత ఈ చాటువుల ఆధారంగా సాంఘిక జీవనాన్ని పునర్ని ర్మింపదలచినపుడు ఆయా శతాబ్దాలకు చెందిన సామాజిక పరిస్థితుల్ని ప్రత్యేకంగా పేర్కొనడం సాధ్యపడదు. సమిష్టిగా 12–20 వ శతాబ్ది వరకుగల ఆంధ్రుల సమాజ ప్రతిబింబాన్ని స్థూలంగా ప్రదర్శింపవచ్చు. ప్రధానంగా 14-19 వ శతాబ్దుల మధ్యకాలంలోని సాంఘిక వ్యవస్థను స్పష్టంగా చూడవచ్చు.

ఆంధ్ర వాఙ్మయంలో కేవలం చాటువులవల్లే ఇంతకాలం ఊపిరి పోసుకొని నిలిచివున్న కవి భీమన. ఒక్క కవిజనాశ్రయం తప్ప- దీని కర్తృత్వం కూడ వివాదగ్రస్తమే - ఆయన కృతులన్నీ గంగపాలైనవి. భీమన పేర చెలామణిలో వున్న చాటువుల్లో ఒక్కొక్కటి ఒక్కొక్క చారిత్రక వృత్తాంతానికి, ఒక గుప్త సత్యానికి గవాక్షాలు తెరుస్తుంది. శ్రీనాథుని చాటువులు సమకాలీన సాంఘిక జీవనానికి ప్రత్యక్ష సాక్షాలు. తెనాలి రామలింగడు, అడిదము సూరకవి, పిండిప్రోలు లక్ష్మణకవి, శిష్టు కృష్ణమూర్తి, తిరుపతి వేంకటకవులు. కొప్పరపు సోదరులు మొదలైనవారి చాటువులు ఆనాటి సంఘ జీవితాన్ని ప్రతిఫలిస్తున్నాయి.

భట్టుమూర్తి, కందుకూరి రుద్రకవి తప్ప ప్రాచీన చాటుకవులు అగ్రవర్ణాలవారు. అయినా వీరి చాటువుల్లో ఆనాటి సామాజిక వ్యవస్థ, వివిధ వర్గాలవారి వృత్తులు, వారి దైనందిన జీవిత విశేషాలు కొంతవరకు తిలకించవచ్చు.

5. మతప్రసక్తి: అనాటి ప్రజలకు దైవభక్తి, పాపభీతి మెండు. సప్తసంతానాలలో దేవాలయ నిర్మాణం ఒకటి. దేవాలయాల్లో నిత్య ధూప దీప నైవేద్యాల నిమిత్తం ప్రభువులు మాన్యాలు దానం చేసేవారు. మైసూరి చిక్కదేవరాయలు-

''దేవమాన్యములు సంభావితాభోగ భూదేవమాన్యములు''
(చా.ప.మం- I. పుట-47)

ఒసగేవాడట.

"దీపించు నేపీట దేవాలయంబులు, ధావళ్యనవసుధాదౌతములయి"
(చా.ప.మం-I. పుట-28)

అని నెల్లూరుపురాన్ని వర్ణించాడు చాటుకవి.

''ఏ పట్టనంబున నెన్నంగ మున్నూట యఱువది దేవాలయంబు లుండు" అన్నదానినిబట్టి ఒకానొకప్పుడు నెల్లూరులో 360 దేవాలయా లున్నట్లు తెలుస్తుంది. మరి అందులో ఇప్పుడు పట్టుమని పది కూడ మిగిలినట్లులేదు. ఆపీట హరిహరులకు సమప్రాధాన్యమున్నట్లు కనిపిస్తుంది.

''చరియించితినిగాని జగము మూలస్థాన పరమేశ్వరుని వంటి భక్త వరదు; పరికించితినిగాని బహుదేశము లనంతపద్మనాభుని వంటి భవ్య మూర్తిగాన''ను అన్నాడు. (చా.ప.మం-I. పుట-29-30). ఆ స్థల ప్రభావంవలననే తిక్కన హరిహరనాథ స్వరూపుని సృష్టించి ఉంటాడు. ఈ చాటువు 13 వ శతాబ్దినాటిదే కావచ్చు.

చాటువులాధారంగ ఆంధ్రదేశంలో శైవ వైష్ణవాలు రెంటిని ప్రజలు అనుసరించినట్లు తెలుస్తుంది. వైష్ణవులైన హరిదాసులు, శైవులైన జంగములు సంఘంలో సమాదరింపబడ్డారు. ఒక కవి తన కవితకు గుర్తింపు లభించనప్పుడు ఇలా వాపోయాడు :—

క. కవితా లక్షణ మెఱుఁగని
యవివేకికిఁ బద్యమిచ్చి యడుగుట కంటెన్
చవిలెఁగొని దండెఁ గొనుకొని
భువిలో హరిదాసుఁడైన బుణ్యమె దక్కెన్.

(చా.ప.మం. I పుట 18)

మైసూరి చిక్కదేవరాయలు "జంగమార్చనము భూషాయమాణ మహా భుజంగ మార్చనము" చేసేవాడట. (అందే. పుట 47). ఈ చాటువు కర్ణాటదేశ ప్రభువు భక్తి ప్రపత్తుల్ని వర్ణిస్తున్నది. కాని కాకతీయుల కాలానికే వీరశైవ మతం ఆంధ్రదేశంలో కూడ వ్యాప్తి చెందినట్లు తెలుస్తున్నది. ఈ మత ప్రచారంవలన సంఘంలో ఆచారాలు మారటమే కాక దేశ భాషలకు మిక్కలి ప్రోత్సాహం లభించింది. శ్రీనాథుడు 'జంగము వారి చిన్నదాని పిసాళితనాన్ని' జంగమభామ చెల్వాను వర్ణించాడు. (అందే. పుట. 123). బౌద్ధమతస్థులను గూర్చిన వివరాలు చాటువుల్లో మృగ్యం. 11 వ శతాబ్దం తరువాత ఆంధ్రదేశంలో దాని ప్రభావం సన్నగిల్లింది. కాకతీయ యుగంలో ఆంధ్రదేశంలో ప్రాచీనాలైన జైన బౌద్ధమతాలు సంపూర్ణంగా క్షీణించి, శైవవైష్ణవ మతాలు ప్రబలినవి.

14 వ శతాబ్దం నుండే మహమ్మదీయులు తెలుగుదేశంపై దండయాత్రలు జరిపారు. వారు 15 వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్యపు ప్రక్క బల్లెంగ బహమనీ రాజ్యాన్ని స్థాపించారు. ఆ కారణంగ దేశంలో మహమ్మదీయ మతం కూడ వ్యాప్తి చెందింది. కొందరు మహమ్మదీయ ప్రభువులు మత సహనాన్ని ప్రకటించారు. చాటువుల్లో ప్రస్తుతింపబడిన మహమ్మదీయ మహీపాలుడు "మల్కిభరాముఁడు." ఈ చాటువులు మల్కిభరాముని నెఱదాతగ, పురుషోత్తమునిగ చిత్రించాయి. అతడు "విప్ర గోవధ చేసిన విధి" విధించేవాడట. (చా.ప.మం. III పుట 121).

6. తిండి తీర్థాలు : కోటి విద్యలు కూటి కొఱకే. ఈ జానెడు పొట్టను నింపడానికే ఆ కాలంనుండి ఈ కాలంవరకు మానవుడు పడరాని పాట్లు పడుతున్నాడు. ఆంధ్రులు భోజన ప్రియులని ప్రతీతి. ఉన్నమాట అంటున్నందుకు కోపం రాదనుకుంటాను. ఆంధ్రుల ఆవకాయ, గోంగూర అంతర్జాతీయ ఖ్యాతిని, విదేశమారకాన్ని ఆర్జించాయి.

చాటువులలో (1) ప్రాచీనార్వాచీనుల ఆహార పదార్థాలు (2) కోస్తా, రాయలసీమ, పల్నాడు, తెలంగాణా ప్రాంతీయుల భోజనాలు (3) సంపన్నుల, పేదల అన్నపానాలు, (4) ద్రావిడ కర్ణాటుల తిండి తీర్థాలు (5) మరికొన్ని భోజన విశేషాలు వివరింపబడ్డాయి.

(1)ఆ కాలంనుండి ఈ కాలంవరకు పల్లవు ప్రాంతీయులకు ప్రధానమైన ఆహారం వరి. మెట్ట ప్రాంతంవారికి జొన్నలు, సజ్జలు, రాగులు. వీటికి ఆదరువులుగ శాకాహారులు వివిధ కూరగాయలు పచ్చళ్లు, పప్పులు, పెరుగు, నేయి ఇత్యాదులు గ్రహించేవారు. వేములవాడ భీమన తన తిట్టు కవితలో తన కాలపు వంటకాలను పేర్కొన్నాడు.

> గొప్పలు చెప్పుకొంచు ననుఁగూటికిఁ బంక్తికి రాకుమంచు నీ
> త్రిప్పుడు బాఁపలందఱును దిట్టిరి కావున నొక్కమాఱు నీ
> యప్పము లన్ని కప్పలయి యన్నము సున్నము గాఁగ మాఱుచున్
> బప్పును శాకముల్ పులుసు పచ్చడులుం జిఱుజాలు గావుతన్.
>
> (తెలుగులో తిట్టు కవిత్వము - పుట. 7)

13, 14 శతాబ్దులకు చెందిన వాడుగ ఊహింపబడుతున్న రాయన భాస్కరుని అన్నసత్రంలో—

ఉ. అన్నరో కొండపల్లి సచివాగ్రణి రాయన మంత్రిపట్టి బా
చన్న జలాన్న సత్రమెడపైన పథంబునఁ బెట్టు నెయ్యి రా
జాన్నము లొల్పుఁ బప్పు పదియాఱు తెఱంగుల కూరగాయలున్
వెన్నెలగుజ్జుఁ బోలు దధి వేసవికాల మవారితంబుగన్.

(చా.ప.మం. I. పుట. 78)

చాటు కవులందరూ ఇంచుమించు శాకాహారులు కావడం చేత మాంసాహారుల పద్ధతులు తెలియడం లేదు.

16 వ శతాబ్దిలో ఫ్రెంచి వారు మన దేశానికి వచ్చారు. ఈ పరాంసులు "పచ్చి మాంసము కల్లు భక్షించి మత్తెక్కి రాణించు" వారట. తురుష్కులు "గంజాయి గుండ హుక్కాలుడికెడి నీళ్ళు ద్రావి ప్రాన్పడుతారట." కొండసవరలు "గోవులఁబడమొత్తి కోసి ముక్కలు మెక్కు" తారట (చా.ప.మం. I. పుట. 170).

మన దేశంలో పోర్చుగీసు వారు రాకపూర్వం మిరపకాయలు లేవు. కారానికి వంటల్లో మిరియాలను ఉపయోగించేవారు. పోర్చుగీసు వారే మనకు మిరపకాయలను పరిచయం చేశారు. మిరియాలకు బదులుగ వాడబడేవి కాబట్టి వీటిని మిర్యపుకాయ లన్నారు. (మిరపకాయ-మనం వాడుతున్నది శబ్దరత్నాకరంలో కాని సూర్యరాయాంధ్ర నిఘంటువులో కాని లేదు. దీనిని మొట్టమొదట పేర్కొనిన నిఘంటువు బ్రౌణ్యం.ఇది విషయాంతరం). అందుకే ఇప్పటికీ కొందరు వైదిక కృత్యాలలో మిరియాలనే వాడుతారు. "పెమ్మయ సింగధీమణి" అన్న మకుటంతో వున్న చాటువులో "మిరియము లేనికూర సరసుల కింపు"గాదని చెప్పబడింది. (చా.ప. మం. I. పుట. 101).

ఆ కాలంలో ఇప్పటి కూల్‌డ్రింక్స్ స్థానంలో షర్బత్తులను వాడే వారు. ఒక ధవుడు తనదయిత చేసిన ఉపచారాలను మననం చేసుకుంటూ వేసగి పగళ్ళలో "మేడలో జన్నికల్ల మెండుగాఁ జల్లించి, తడియొత్తి చిఱు చాఁపలిడి సుమ్మదుల తల్పంబుఁ బఱిచి చెంతల మిన్నలగు షర్బతుల"ను ఉంచేదని తలపోస్తాడు. "గంజాయి త్రాగి తురకల, సంజాతులఁ గూడి కల్లు చవిగొన్నవా ?" అన్న సమస్యాపూర్ణము బట్టి ఆ కాలపు మత్తుపదార్థాలు గంజాయి, కల్లు అని గ్రహింపవచ్చు. 18 వ శతాబ్దానికే "షోడా వాటరు" ఆంధ్రదేశంలో ప్రవేశించింది. (చా.ప.మం. II. పుట. 52).

ఆంధ్రులకు నీరు మజ్జిగ అలవాటు. గ్రామీణుల ఆతిథ్యంలో ఇది తప్పక ఉంటుంది. ఆరోగ్యకరమైనది. ఎండతాపాన్ని పోగొట్టేది. ఇప్పుడు దీని స్థానాన్ని కాఫీ ఆక్రమించింది. ఈ నీరు మజ్జిగను తయారు చేసే విధానం ఈ క్రింది చాటువులో విపులంగ ఉన్నది :

క. గొప్పైన నిమ్మపండ్లును
గప్పురమును సొంటి పొడియు గఱి వేఁపాకున్
ఉప్పును నేలకు లింగువు
నొప్పుగ నీ చల్లరుచికి నొన గూర్పఁదగున్.

(చా.ప మం II. పుట. 126)

ఇందులో సామాన్యంగ ఇంగువ వేయరనుకుంటాను. అయినా ఇంగువ వాత హారిణి కదా !

ఆధునికులకు ప్రీతికరమైన ఉపాహారంలో పకోడి ఒకటి. చిలుకమర్తివారు తమ స్వీయ చరిత్రలో తామా యా సందర్భాలలో చెప్పిన చాటువులను వివరించారు. ఒకనాటి సాయంకాలం నాటక సమాజ సభ్యు

అందరూ చేరి ముచ్చటలాడుకుంటూ, పకోడీలు తింటున్నారు. వారిలో టంగుటూరి ప్రకాశంపంతులుగారున్నారు. ఆయన చిలకమర్తివారిని "మీరు పకోడీల మీద పద్యాలు చెప్పండి, పద్యానికొక పకోడి బహుమానమిస్తాం" అన్నారు. ''కవులకక్షర లక్షలిచ్చేకాలం గతించింది. పద్యానికి పకోడి ఇచ్చే దుర్దినాలు వచ్చినవి" అని వెంటనే ఆశువుగ వారు కొన్ని పద్యాలు చెప్పారు. అందులో ఒకటి:-

క. కోడిని దినుటకు సెలవున్
వేడిరి మును బ్రాహ్మణులును వేధ నతండున్
కోడిపలదా బదులు ప
కోడిం దినుఁడనుచుఁ జెప్పె కూర్మి పకోడీ!

(తె.చా.క. పుట. 172).

అధునాతనుల జీవితంలో కాఫీ ఒక భాగం. కాఫీ మీద చాటువులు వచ్చాయి. ''పిక్కల్ పట్టుకపోవు ప్రొద్దుటను కాఫీ వచ్చి యీ గొంతు కన్, గుక్కెండైనను జాఱకున్నయెడ" (శృంగార చాటువులు-పుట 58) అని మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి గారు కాఫీ చాటువులు చెప్పారు.

ఈ కాలపు ఫలాహారాలను ప్రస్తావిస్తూ కీ. శే. అబ్బూరివారు దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారిని సంబోధిస్తూ ఆశువుగ చెప్పారు.

మ. ఉపమాపై పెసరట్టుపై యిడిలిపై, హుమ్మంచు చూపించు నీ
జప సంబద్ధ పరాక్రమక్రమ కటాక్షశ్రేణి మన్నించి శు
భ్రపు జిల్లేబి పకోడిలడ్వగయిరాపై కొంతరానిమ్ము శ్రీ
చపలాపాంగ సితాంగనా హృదయ పాశా పూజ్యవస్తుప్రియా.

పొగత్రాగడం విదేశీయులే అలవర్చారు. దీనిని కూడ పోర్చుగీసు వారే మన దేశానికి 400 సంవత్సరాలకు ముందు తీసుకవచ్చారు. పొగాకును గూర్చిన అద్భుతమైన సీసపద్యాలు చాటువులుగ వెలసినవి.

క. ఖగపతి యమృతము తేఁగా
భుగభుగమని పొంగి పొరలి భూస్థలిఁబడి తాఁ
బొగచెట్టయి జన్మించెన్
పొగ్రదావని వాఁడు దున్నపోతై పుట్టున్.

నస్యాన్ని సుదీర్ఘ సమాసాలతో వర్ణించిన చాటువులు ఉన్నాయి. బుక్కపట్నం తిరుమల తాతాచార్యుల వారికి ఈ నస్యం లేకపోతే తోచదు. ఒకమారు ఒక శాస్త్రిగారిని నస్యమడిగి ఆయన లేదంటే కోపగించుకొని "కాస్తంత నస్యమడిగిన నాస్తే యని పలుక వీని నాలుక పీఁకా" అని తిట్టాడు. (చా.ప.మం. III. పుట. 135)

(2) ఆంధ్ర రాష్ట్రంలో రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలు కోస్తా ప్రాంతాలకన్న వెనుకబడినవని ప్రత్యేకంగ చెప్పనక్కరలేదు. భౌగోళికంగా కోస్తా ప్రాంతీయులది సారవంతమైన భూమి కావడంచేత పంటలు సమృద్ధిగ పండే అవకాశమున్నది. వారు వర్తక వ్యాపారానుకూలతవలన సంపన్నులు. నదీ మాతృకలు కలవారు. కనుక వీరి తిండితీర్థాలు తదితర ప్రాంతీయులకన్న భిన్నంగ ఉంటవి. పాయసాన్నం, పిండివంటలు, అజ్యం, పల్చని పెసరొల్పుపప్పు, మెత్తనై స్వచ్ఛమై మెదవెడు రాజాన్నం, బహువిధ శాకాలు, ఊరగాయలు కోస్తా ప్రాంతం వారికి నిత్య భోజనం. (చా.ప.మం. 1 పుట 93) ఇటువంటి రుచికరమైన భోజనానికి అలవాటు పడ్డవాడు కనుకే శ్రీనాథుడు పల్నాడు వెళ్ళినపుడు జొన్నన్నానికి,. అంబలికి బాధపడ్డాడు. తీరాంధ్ర వాసులకు ఇటువంటి భోజనం అల

వాటు లేదు. బొగ్గరపు పెద పాపరాజనే కవి ఒకమారు నిజాం రాజ్యానికి వెళ్ళినపుడు ఒక గ్రామంలో మీకు కావలసిన భోజన సామగ్రి చెప్పితే పంపుతామన్నారు. అందుకు కవి చెప్పిన చాటువు:-

క. ముప్పావుశేరు బియ్యము
పప్పుఱ సోలెండు నెయ్యిపావెఁడు పూబం
డొప్పార పావుశేరుగ
నిప్పింపుడి యుప్పుగాయలింతే చాలున్.

(చా. రత్నా. పుట. 64)

రాయలసీమ కరవు ప్రాంతం. ఈనాటికీ అక్కడ సరియైన నీటి వసతులు లేవు. బుచ్చి సుందరరామశాస్త్రిగారు అక్కడి వారి అవస్థను ఇలా చెప్పారు:

సూపంబన్నది చూపుచూపునబడెన్ చోష్య స్వరూపమ్ము దా
దాపై పోయెను చూరునీళ్లకిఁక నేతన్ వేపుడుల్ కూడనా!
పోపుంబెట్టు కొనంగ నాముదముకే పుట్టన్ గతుల్ లేవిదే
పాపంబో ససి దప్పెనెట్టి పయిలాపచ్చీసు సంసారమున్.

(శృంగార చాటువులు. పుట. 18)

"పలినాటికిఁ మాటికిఁ బోవనేటికిన్?" అని ప్రశ్నించుకున్నా అక్కడికి మాటిమాటికి వెళ్ళి ఉండబట్టే అక్కడి విశేషాలను శ్రీనాథుడు మనకు మిగిల్చి పోయాడు. పలనాడులో "జొన్నకలి, జొన్నయంబలి, జొన్నన్నము, జొన్నపిసరు" తప్ప "సన్నన్నము సున్న." కొండవీటి జొన్నన్నంలో ఏదో విశేషం లేకపోతే శ్రీనాథుడు శివునితో ఇలా సవాలు చేసి ఉండడు-

ఆ. పూర్వమందు విషము పుచ్చుకొన్నానని
గర్వపడెదవేల కాలకంఠ!
కొండవీటి సీమ పండుజొన్నలకూడు
తిన్న నీదు బయిసి తేటపడును.

(చా. మం. II. పుట. 124)

ఈ జొన్నన్నానికి భార్తుల ఇంటిలోని ఆదరువులను తెలుపుతుందీ చాటువు:

క. పాలుబ్బ జొన్నయన్నము
తాలించిన వంగవరుగు తైలపుధారల్
తేలఁ బరామర్శఁబున
బాలురతోఁ గుడవబెట్టు భార్తులపెద్దా!

(చా. మం. II. పుట. 125)

విస్సన్న మంత్రి సహపంక్తిలో హేమపాత్రాన్నానికి అలవాటుపడ్డ యీ కవిరాజు ఈ జొన్నన్నానికి బెదరిపోయి తనకు తానే ధైర్యం చెప్పుకున్నాడు-

సీ. కఠినంపుజొన్నల కటుకుకుడుములఁ జూచి
వక్త్రమా! భయపడవద్దు సుమ్ము
నానారుచుల్ గోరు నాలుకా! నీవేమి
సందేహ పడవద్దు చప్పరించు
ఎన్నఁడుఁ గడిచేయ నెఱుఁగ నెట్లోయని
కుక్షిహస్తమా! నీవు జడియఁబోకు
కమ్మని వాసనల్ గ్రక్కున త్రేన్చెడి
గర్భమా! కుటకుట కాకయుండు.

(చా. మం. II. పుట. 125)

పలనాటిలో రేగడిభూమి విశేషం. అందుచేతనే అక్కడి జనులు మెట్టపొలాల్లో జొన్నలు పండించి తింటారు. పైగా నీటి ఎద్దడి. ఆ సీమలో శ్రీనాథునికి జొన్నకూడు, చింతచిగురు, బచ్చలి ఆకు కలిపి వండిన ఉడుకు అన్నాన్ని వడ్డిస్తే ఈమాదు విష్ణువును పందేనికి పిలిచాడు-

ఉ. ఫుల్లసరోజనేత్ర! యలపూతన చన్నులచేఁదుఁ ద్రావినాఁ
డల్ల దవాగ్ని మ్రింగితినటంచును నిక్కెదవేల? తింత్రిణీ
పల్లవయుక్తమౌనుడుకు బచ్చలి శాకము జొన్నకూటితో
మెల్లన యొక్కముద్ద దిగమ్రింగుమ! నీ పస కాననయ్యెడిన్.

(చా. మం. I పుట. 127)

కొండవీటి కమ్మ చౌదరుల భోజనం కొంత మెరుగనిపిస్తుంది. ''బానెఁడు జొన్న పంటకము, పంటెఁడు పాలుసు, మేటి చారులెం, తేనియుఁ బుల్లఁగూర కడుఁదేరిన మజ్జిగ''లను సేవించేవారు.(చా.మం. II పు.114)

మసర రాజ్యంలో ఉల్లిపాయలు, సంకటిముద్దలు, జనుప శాకాలు వాడేవారు. రేనాటిలోని "మెఱసెడి రేనాటి జొన్న మెదుకులు" గొంతు దిగదు. పడమటి వ్యాపారులు "చింతంబళ్ళు" త్రాగేవారట.

(3) ఆ కాలపు సంపన్నులు సుఖభోజన ప్రియులు. వారికి అజీర్ణాది వ్యాధులున్నట్లు కనుపించదు. ఈ క్రింది చాటువు ఆనాటివారి భోజన ప్రియతను తెలుపుతుంది–

సీ. ఆపూపసూప సప్తాంగ భంజనులార,
ఆజ్యసాగర బడబాగ్నులార,
శ్రాద్ధాన్నభుక్తి విచార తత్పరులార,
పచ్చళ్ళ రుచులకు మెచ్చులార,

పొరుగూరి తిండికిఁ బొడువుఁ జుక్కల్లార,
వేఁటొక్కచో వాయు వేగులార,
పానక వాహినీ మానభంజకులార
బొబ్బట్ల దొంతుల కుబ్బులార,
గీ. తక్రసాగర వాతాపి దమనులార
జఱ్ఱుపాటిన వ్రేలుడు బొజ్జలార
దినదినము తద్దినముకోరు ధీరులార
పాఱు తేరయ్య! సాపాటు బాపలార! (చా.మం. II - 125)

ఆనాటి విందు భోజనంలోని పదార్థా లిందులో పేర్కొబడ్డాయి. పప్పనం, పరమాన్నం, నేయి, పచ్చళ్ళు, పానకాలు, బొబ్బట్లు, మజ్జిగ విధిగ ఉండవలసిన పదార్థాలు.

కలవారు చక్కెరలు, జీడిపప్పులు, బాదము పప్పులు, మంచి ద్రాక్ష పండ్లు, కజ్జాయములు, ముంత ఖర్జూరాలు, భోజనానంతరం సేవించేవారు (చా.మం. II పుట. 52).

పేదవారింటి భోజనం ఇలా ఉండేది :-

ఉ. మూతిని ముట్టఁగా వెఱతు ముద్దకు ముద్దకుఁ గూటిలోపలన్
బాతికపాలు సైకతము పచ్చడి కొంచెమ యాది యంత్యమున్
జూతమటన్నలేదు మఱి సున్నము కన్నను మెత్తనన్నమీ
రాతిరిఁబోలె భోజన మరాతికి నైనను వద్దు దైవమా!
(చా. మం. II పుట. 124)

(4) ఆంధ్రదేశంలో ప్రతిపూట మిరియాలచారు చేయరు. ఆంధ్రుల భోజనంలో పప్పు ప్రధానం. మరి తమిళుల భోజనంలో చారు ముఖ్యం.

అలవాటులేని ఆ చారుసు మొదట వడ్డించేసరికి శ్రీనాథునికి వైముఖ్యం కలిగింది-

సీ. తొలుతనే వడ్డింత్రు దొడ్డ మిర్యపుజారు
చెవులలోఁ బొగవెళ్ళ చిమ్మిరేఁగ
పలు తెఱంగులతోడఁ బచ్చళ్ళు చవిగొన్న
బ్రహ్మరంధ్రముదాఁకఁ బారునావ
యవిసాకు వేఁచిన నార్నెల్లు నుసిలేదు
పరిమెళమెంచినఁ బంద్లు సొగసు
వేపాకు నెండించి వేసిన పొళ్లను,
గంచానఁ గాంచినఁ గ్రక్కు వచ్చు

గీ॥ నఱవ వారింటి విందెల్లనాగడంబు.

(చా. మం-I. పుట131)

కర్ణాట రాజ్యంలో ఆకాలంలో వెల్లుల్లి, తిలపిష్టం, చల్లా అంబలి సామాన్యుల భోజనం.

(5). ఆంధ్రులకు కొన్ని కొన్ని ప్రియతమ పదార్థాలున్నాయి. అందులో గుత్తివంకాయకూర వొకటి -

క. వంకాయ వంటి కూరయు,
పంకజముఖి సీతవంటి భామామణియున్
శంకరుని వంటి దైవము
లంకాపురి వైరివంటి రాజును గలఁడే.

(చా. రత్నా. పుట 211)

బఱ్ఱెపెరుగు మరొకటి: ఓంగోలు పశువులు ప్రపంచ విఖ్యాతిని గడించినవి. ఓంగోలులో ఒకానొకకవి బఱ్ఱెపెరుగు గుణాలను ఏకరువు పెట్టాడు. కాశి

దాసు శరచ్చంద్ర చంద్రికా ధవళిమను మాత్రమే వర్ణించాడు. కాని యీ కవి -

సీ. తెల్లనై యమృతంపుదీప్తిని విలసిల్లి
భాసిలు చుండునే బత్తెపెరుగు
గట్టిగా ముద్దలై కన్నుల కిష్టమై
భ్రాంతిఁ బుట్టించునే బత్తెపెరుగు
మోహంబు శాంతించు, మెత్తనౌదేహంబు
బొజ్జలు పెరిగించు బత్తెపెరుగు
ఆకలి బుట్టించు నన్నంపు రుచి బెంచు
పైత్యంబు హరియించు బత్తెపెరుగు
గీ. బక్క వానిని బలిపించు బత్తెపెరుగు
బ్రాహ్మణుల కిష్టమైనది బత్తెపెరుగు
పరఁగ నీలాద్రి హరిప్రీతి బత్తెపెరుగు
పరమ సౌఖ్యంబు నిచ్చునే బత్తెపెరుగు

(తెలుగులో చాటుకవిత్వం. పుట 440)

భోజనానంతరం తాంబూల సేవనం ఆంధ్రుల కలవాటు. అజీర్ణాది రోగాలను హరించే నిత్యౌషధం తాంబూలం. తాంబూలాన్ని కేవల ఆకు, వక్క సున్నంతో సేవించే వారు కాదు. కర్పూరం, కస్తూరి ఇత్యాది పరిమళ ద్రవ్యాల్ని మిశితం చేసి సేవించేవారు. వచ్చిన వారికి మర్యాదగా "కర్పూర తాంబూలాలు" పెట్టడం ఆకాలపు మర్యాదలలో ఒకటి.

వినుకొండలో రాయన భాస్కరుడు "తాంబూల సత్రాన్ని" నెల కొల్పాడు. (చా. మం-I. పుట 82)

శ్రీవాథుడు దుకాణంలో తములపాకులు కొనబోయి. ఆ ఆకుల నందిస్తున్న అలికులవేణి అందాన్ని చూచి ఆనందించాడు. "తొలకరి మించుఁ దీవగతి తోఁప దుకాణము మీఁద నున్నయి య్యలికుల వేణితో దముల పాకుల బేరము లాడఁబో యాఁడు. (చా. మం-I. పుట123)

7. అభ్యంజనం : ఆధునికులు త్వరజీవనులు. పైగా పట్టణ వాసము జీవిత విధానాన్నే మార్చింది. ఇరుకు కొంపల్లో చాలీ చాలని వస్తువులతో అన్నీ సరిపెట్టుకోవాలి. ముఖ్యంగ నీళ్ళు పట్టణవాసులకి అమృతం వంటి అపురూపమైన వస్తువు. అందుకే ఇప్పటివారి స్నానాలు కాకి స్నానాల వంటివి.

ప్రాచీనులకు వస్త్రాభరణాదులకు ముందు వేషరచనలో ప్రధానాంగం స్నానం అంటే అభ్యంజనమే. స్నాన విషయంలో వాళ్లు చాలా శ్రద్ధ చూపేవారు. అందుకే సుమతి ''ఎడతెగకపారు నేరు'' ఉన్న ఊళ్లోనే ఉండమన్నాడు.

పురుషులు నదుల్లో చెరువుల్లో, ఏటిలో, నూతిగట్టున బట్టబయలి ప్రదేశాలలోనే స్నానం చేసేవారు. అందుకే ఖడ్గతిక్కన సతీమణి చేసిన స్నాన యేర్పాటులకు చిన్నబుచ్చుకున్నాడు. రాయన భాస్కరుడు జల సత్రాలను, శిరస్స్నానానికి నూనె సత్రాలను. జలకమాడటానికి ఇంట జల సృష్టి సత్రాలను నిర్మించాడు. ఆశతీర స్నానం చేయడానికి పల్నాడులో అవకాశం లేదని శ్రీనాథుడు "సిటికై భంగపడంగఁ బాల్పడు కృపా పరులెవ్వరు లేరు" అని వాపోయాడు.

8. వస్త్రధారణ : ప్రాచీన చాటువులు స్త్రీ పురుష వస్త్రధారణాన్ని, రాజుల దర్బారీవేషాన్ని, వీరుల యుద్ధ అలంకరణని వర్ణించాయి.

చాటుకవుల్లో శ్రీనాథుడే వేషధారణ వర్ణన విషయంలో అధిక శ్రద్ధ చూపినవాడు.

అనాటి శ్రీమంతులు "అంగీలు పచ్చడంబులు, చెంగావి మెఱుంగు సేలు సరిగంచుల మేల్ రంగుల దుప్పట్లు" ధరించేవారు (చా రత్నా. పుట 184).

అంగీలు నిడుపై, బొందులు కలిగి ఉండేవి. "చీరకోక" అన్న పదాలు అప్పటికింకా అర్థ పరిణామాన్ని పొందలేదు. అది స్త్రీ, పురుష వస్త్రాలకు సామాన్యవాచిగ ఉపయోగింపబడేది. వెలుగోటి యాచమనాయని దాటికి తట్టుకోలేక కకావికలైన పాపానాయని సైన్యం "వెఱచి వాచఱచి మైమఱచి *కోకలు* వీడి, వెస దిగంబరులయి మసలి" నదట. (చా.మం. III.పుట. 291).

యుద్ధానికి చెలరేగిన రెడ్డి బిడ్డలు "బైటను జిగిమించు పైఠాణికట్టు వర్గంబులు పచ్చల కడియములును; రాజించు కట్టాణి ముత్యాల చౌకట్లు, హొంబట్టులు దట్లు మేని; ముంగా మురంబులు నుంగరాల్, తలిమంపు దుప్పటంబులు జిరాక్ ముప్పిడ**ములు;** బంగారు నీర్వోతపని చెక్కడాలును' ధరించారట. (చా. మం-III. పుట 297). ఆ కాలపు పట్టులలో పలు భేదా లుండేవి. హొంబట్టు అంటే బంగారు వన్నెపట్టు. అంగీలమీద "పట్టు దట్లు" కట్టుకునేవారు.

కాలక్రమంగ పురుషులు అంగీల స్థానంలో చొక్కాలు తొడగడం ప్రారంభించారు. ఇది 16. వ. శతాబ్దానికే ఆచారమయినట్లు కనిపిస్తున్నది రామకృష్ణుడు పెట్టిన పరీక్షకు ఒక కవి చెప్పిన సమాధానం

"వక్కలు చేరెఁడు నేఁగొని, చొక్కాలోఁ బోసికొంటె...
"(చా. రూ. ప. బ)

విజయ నగరరాజుల దర్బారీ వేషాలు విచిత్రంగ ఉండేవి. పొడవైన అంగీధరించి, పొడవైన కుల్లాయి (టోపీ) పెట్టుకొని పోవాలి. కార్యార్థియైన శ్రీ నాధునికి యీ వేషం వేసుకోవడం తప్పలేదు. అందుకే "కుల్లాయుంచితిఁగోక సుట్టితి మహాకూర్పాసముం దొడ్గితిన్. (చా. మం-I. పుట 119) అని చెప్పుకున్నాడు.

వెలమ ప్రభుల దర్శనార్థం వెళ్లేవారు కూడ దర్బారీ వేషం వేసుకోవాలట. ఒకమారు కోలాచల మల్లినాథ సూరి సర్వజ్ఞ భూపాలుని దర్శనార్థం వెళ్లాడు. రాజుగారి కొలువు కూటానికి వేషం లేకుండ వచ్చాడని కంచుకి లోపలికి పోనీయలేదు. అప్పుడు మల్లినాథుడు ఇలా అన్నాడు:-

కిందారుణా వంకరటింకరేణ
కిం వాసనా చేకిరి చాకిరేణ
సర్వజ్ఞ భూపాల విలోకనార్థం
వైదుష్యమేకం విదుషాం సహాయః
(ఆంధ్రుల సాంఘిక చరిత్ర. పుట 160)

పడమటి సీమ వ్యాపారులు అంటే గోలకొండ వ్యాపారులు. దస్త్రాలకు మసిబుర్రలను, కలాలను, చెమటబట్టిన నీర్కావుల్ని ధరించి, పెద్ద గడ్డాలను పెంచేవారట. (చా.మం-II పుట 728). కోస్తా ప్రాంతంలో నియోగులు కరణీకం చేసినట్లే, తెలంగాణా ప్రాంతంలో గోలకొండ వ్యాపారులు కరణీకం చేసేవారు. వీరు శ్రీనాథుని కాలంలో ఎలాగున్నా ఆ తరువాత నాగరికతను నేర్చుకున్నారు. హంసవింశతిలోని వీరి వర్ణనను బట్టి

(2 ఆ. 30. ప.) వీరు తలకుపాగ, చెవులకు పోగు, చెవిలో కలం, చక్కగా నుతికిన ధోవతిని కట్టి, పాదాలను పాదరక్షలు తొడిగి, చేతిలో కావలసిన కాగితాలను, కాశ్మీరు శాలువను భుజాలు మీదుగ కప్పుకొనే వారట. వీరు ''రుమాళ్ల''ను కూడ ఉపయోగించేవారు. తూరుపునాడులో వెలమనాయుళ్లు ''వింతకట్టు రుమాళ్లు" ధరించేవారు. కర్ణాటదేశపు వేట కాళ్లు కూడ "జిలుగు వన్నె రుమాళ్ల"ను కట్టుకునే వారు.

(చా.మం.II పుట 116)

అడిదము సూరకవి కుత్సితాక్షేపకుల వేషాన్ని వర్ణించాడు. ఆ కాలపు పండితుల వేషమిట్లుండేదని గ్రహింపవచ్చు:

సీ. తట్టెడంత విభూతిఁబెట్టి తాతలనాఁటి,
    కుండలా ల్వీనుల గునిసియాడ
మైలగ్రక్కెడు సేలు మడతలు నరసిన
    బోడిబుఱ్ఱల మీఁదఁ బొసఁగఁజుట్టి
ప్రాత నీరుంగావి పంచెలు ముష్కము
    ల్గను పింపఁగా డొల్లు కచ్చగట్టి
యంగ వస్త్రంబులు నతికి కుట్టిన యట్టి
    దుప్పట్లు పైఁ గప్పి''

తుదలు చినిఁగినట్టి పుస్తకముల కట్టలు చంకలో పెట్టుకొని ఉంటారట. (చా. రత్నా. పుట 52-53)

ఈ వర్ణనలను బట్టి పురుషులు సామాన్యంగ ధోవతులు, అంగవస్త్రాలు ధరించేవారని రాజ సందర్శనార్థం విశేషవస్త్రాలంకరణ అవసరమని తెలుస్తుంది.

స్త్రీల వస్త్ర విశేషాలను చెప్పడంలో శ్రీనాథుని వర్ణనా వైచిత్రి విచిత్రమైనది. ఎన్నో తెగలకు చెందిన అన్నుల మిన్నలు వారి వారి వేష భూషలతో శ్రీనాథుని చాటువుల్లో సింగారమొలుకుతూ కనిపిస్తారు. శ్రీనాథుడు పలు తెరగుల పైటల్ని చిత్రించాడు. చీరలను, అవికెలను వన్నెల వారీగా వర్ణించాడు.

'వావిరి చక్కని పైట' (క్రీడాభిరామము పీఠిక పుట 89) పాలిండ్లమై నాచు పైట "బిరుసుఁబయ్యెద చెంగు; ఓరపయ్యెదకొంగు; మైజారు కొంగుల"ను శ్రీనాథుడు వర్ణిస్తే (చా.మం. I పుట 120-124). తిరుపతి వేంకట కవులు "సరిగంచులపైట"ను పేర్కొన్నారు. (నానారాజ సందర్శనము పుట 30 వ 63).

అప్పటివాళ్లు ఎఱ్ఱచీర, తెల్లనిచీర, తెల్లమడుంగు, కుసుమంబద్దిన చీర (వీధి నాటకము పుట 5-8) కుసుంబామేల్మిచీర (చా. మం. I పుట. 17) పాల వెల్లువ వంటి చేల, చెంగావి చీరలను (చా.మం. I పుట 134-136) కట్టుకునేవారు. చీరలే కాకుండ స్త్రీలు "జిల్గుమల్లు సెల్లాలు కూడ ధరించేవారు. (చా. మం. III. పుట 141).

బొందిలిభామ "వన్నెలగాగర" బిగించింది (వీధి నాటకం పుట 10) గాగరా అంటే పావడా. రంగురంగుల పావడాను కట్టుకున్నది. బోందిలీలు తెలుగువారు కారు. ఒక చాటువులో గుజరాతిభామ నీలాటి రేవుకు రావడం చెప్పబడ్డది. ఆమె "రంగైన కుత్తినీ అవిక మేలెడ లించి...జలతారు కొంగున ముసుగు దిగిచి వెండి బిందెయుఁజేఁబూని..." హంస నడకలతో బావి నీళ్ళకు వచ్చిందట. (తెలుగులో చాటు కవిత్వం పుట 433).

కాసలవాటి వారి కనకాంగి ''మాసినచీర'', కుమ్మరి వారి బాలిక ''మలిన వస్త్రాన్ని'' కట్టుకున్నా కుసుమాస్త్రుని సాయకాలులాగ వారి అందం కొట్టవచ్చినట్టున్నది. (వీధి నాటకము పుట 6-9) ''సన్నపు చీర గట్టి'' తెలగాణ్యపు సుందరి నీలాటి రేవుకు వచ్చింది. (తెలుగులో చాటు కవిత్వం పుట 442).

వేపారి కలువకంటి ''షైలత్రైక''ను ఒక మచ్చె కంటి ''కావి రవిక''ను తొడిగారు (చా:మం-I పుట 121, 124, 134). తిరుపతి వేంకట కవులు ''పెఠిణీరైక"ను పేర్కొన్నారు. (నానారాజ సందర్శనం పుట 30 ప. 68)

ఇలా చాటువులు ఆయా రంగుల కోకలకు, వన్నెల రవికలకు, మనోహరంగ వర్ణించాయి. అంతేకాక చీరలను కట్టిన తీరులను, అలంకరించుకున్న ఆభరణాలను అందంగా వివరించాయి. వాసిరెడ్డి వేంకటాద్రి నాయని పట్టమహిషి "అంగుగా నపరంజి యంచు చీర ధరించి రంగైమెఱుంగారు రవికఁదొడిగి...సొమ్ములందంబుగ సొరిదిఁదాల్చి'' రాజుగారి రాకకొరకు ఎదురు తెన్నులు చూచేది. (చా.మం. II పుట 165) ఇలా స్త్రీ పురుషుల వస్త్ర విశేషాలు, వివరాలు చాటువులవల్ల తెల్లమవుతున్నాయి.

9. ఆభరణాలు : సొమ్ముల విషయంలో అప్పటి స్త్రీ పురుషులకు ఎక్కువ భేదమున్నట్లు తోచదు. ఒకటి రెండింటిలో మాత్రం తేడా ఉండవచ్చు. స్త్రీలు ఆభరణాలు ధరించడం అవశ్యమని శాస్త్రమే విధిస్తున్నది. భర్త ఆయుస్సును అభివృద్ధి చేస్తుందట. ఆడు వారి ఆభరణాలలో ముక్కర చాల ప్రధానంగ భావించారు. అందుకే కవి

ఉ. అంగనలేచి యిల్లు చదరంగ బలంబులులేని రాజు ని
స్సంగుఁడు గాని మౌని జనసమ్మతిలేని ప్రధాని కామినీ
సంగతి లేని యౌవనము శాంతము లేని తపంబు స్త్రీలకున్
ముంగర లేని భూషణము మోదమటే? భువిరాఘవేశ్వరా!
(చా.రత్నా. పుట 209)

అని ప్రశ్నించాడు.

రత్నతాటంకాలు, బంగరు కుప్పెలు, ముంగామురంబులు, మొల త్రాళ్ళు, బటువులు, వెండితట్లు, పాగాలలో పలకల అద్దాలు, పసిడిగిండ్లు, సికతాయెతులు మెడనూళ్ళు, నీలాల పోగులు, నేవళాలు, సందుల కడియాలు, జల్లులు, సమాలు- ఇవన్నీ పురుషులు ధరించేవారట. వీటిని రణరంగంలో "ప్రాణ భయంబునఁ బాఱవైచి" పోయారట. (చా. మం. III. పుట. 277) వీరులు బిరుదు వింజామరాలను ధరించే వారు (చా. మం. III. 277+291) అంటే ఈ కాలపు మిలటరీవాళ్ళ Stars and Medals వంటివి.

శ్రీమంతులు మగబిడ్డల్ని బంగారు మొలత్రాడులతో పట్టుదట్టీలతో, సందెతాయెతులతో, సిరిమువ్వ గజ్జెలతో అలంకరించేవారు. (చా. మం. I. పుట. 1)

స్త్రీలు కాళ్ళకు 'పాంజేబులు' చేతులకు "పోచీలు" మెడలో 'కంటె'ను పెట్టుకునేవారు. (చా. మం. III. పుట. 140)

ఆ కాలంలో పెండ్లికూతురికి మగపెండ్లివారు పెట్టే నగలు-

సీ. పెండ్లికూఁతురికేమొ పెట్టేటి సొమ్ములు,
సరిగెపచ్చలు చిన్నసరము తీగె
బేరెలు, పిల్లాండ్లు బెబ్బులికాయలు,
వీరమద్దెలు పణిహారములును

గంటల మొలనూలు దండయొడ్డాణంబు,
రంగొ ప్రధానంపుటుంగరంబు
సిరిగజ్జెలందెలు చేర్చుక్క బంగారు
నేవళంబగు కొల్కిబావిలీలు

గీ. అన్నియును దెచ్చి యిచ్చెద మాదరించి
ఘనుఁడ వోమామ! గంధానఁ గాళ్ళుకడిగి
పిన్నవరుఁడను నాకు కన్నె నిమ్ము
శ్రీకరంబుగ నాశీర్వదింపు మమ్ము. (చా. మం. II. పుట. 123)

బేరెలు, పిల్లాండ్లు, బెబ్బులికాయలు, వీరమద్దెలు, పణిహారాలు ఆనాటి నగలు. ప్రధానానికి పెండ్లికూతురికి ఉంగరం పెట్టే ఆచారం ఇప్పటికీ ఉన్నది.

ఆనాటినుండి ఈనాటివరకు అల్లుళ్ళ కోరికెలు గొంతెమ్మ కోరికలు గానే ఉన్నాయి. అలకపాన్పు నెక్కిన అల్లుడు అడిగే అరణాలు!

సీ. అరణంబు తగుమాత్రమడిగితినో మామ!
జాళువా చౌకట్లు సరిపిణీలు
పచ్చల కడియాలు పది వ్రేళ్ళ బటువులు
పటువు మాణిక్యాల పతక మొకటి
బిరుదు చెక్కడపుది బిళ్ళల మొలత్రాడు
జమిలివి యుత్తర జందెములును
తగటుఁగోఁకలు మంచివగు రెండు సేలులు
దస్తి తురాయి జల్తారు పాగ
బంగారు పాలని బాలీసు గొడుగులు
జులుమతీ తేజీలు సూర్యపుతము

గీ. కడు విలువగల్గు బంగారు కలముదారు
పనితనము మీఱు దంతంపుఁ బావుకోళ్ళు
మామ యివి యిచ్చి ముద్దుకుమార్తె నిమ్ము
శ్రీకరంబుగ నాశీర్వచింపు మమ్మ.

(చా.మం-II. పుట-123-124)

10. సుగంధ ద్రవ్యాలు: ఆ కాలపువారి వేష రచనలో సుగంధ ద్రవ్యాలు ప్రధానమైనవి. కస్తూరి, పునుగు, జవ్వాజి, పచ్చకర్పూరము, కుంకుమపూవు, శ్రీగంధము, అగరు, పన్నీరు మొదలైన సహజ ద్రవ్యాలతో వారు మునిగితేలేవారు.

శ్రీమంతుల నిత్యజీవితంలో కస్తూరి ప్రధానమైనది కనుక "రంభఁ గూడెఁ దెనుంగు రాయ రాహుత్తుండు, కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు?" అని కవిసార్వభౌముడు చింతించాడు. విజయరాఘవుని వలపులో చిక్కిన రంగాజమ్మ 'జవాదియు నలదుట'కు మైమరచినదట. (చ. మం. I. పుట. 64).

ఒక బాలామణిని చూచి–

క. కుంకుమ లేదో మృగమద
పంకము లేదో పటీర పాంసువు లేదో
సంకు మదము లేదో యశు

భంకరమగు భస్మమేల బాలా! నీకున్. (చ.మం-I. పుట. 137)

శ్రీనాథుడే ప్రశ్నించినట్లు జనశ్రుతి–

ఒక సఖియ తన విభునికి 'అగరు గంధంబుఁ బూసిచలువ పన్నీరులు చల్లి, మల్లె పూదండలును, జాజిపూదండలురమున వేసి' మురిసి పోయింది. (చా. మం. III పుట. 144).

11. గృహ నిర్మాణము : ఆ కాలపుటిండ్లు అన్ని ఋతువులకు అనుకూలంగ కట్టినవి. ముంగిటిలో ఇరుప్రక్కల అరుగులు ఉండేవి. కోస్తా ప్రాంతాలలో కిటికీలున్న మేడలు ఉండేవి (చా. మం - III పుట. 141-142). అందుకే పల్నాడులో పెట్టిలా బిగించికట్టిన ఇండ్లు శ్రీనాథునికి నచ్చలేదు. "మిద్దెలు మిద్దెలన్న మన మేడలకంటెను సొంపు నించి బల్ నిద్దపు సౌధజాలముల లీలవెలుంగు నటంచు నెంచినే, నద్దిర మోస పోతి" అని విచారించాడు (కా. రత్నా. పుట. 10).

పల్నాటి సీమలోని పురోహితుని యిల్లు "దోసెఁడు కొంప" మాత్రమే. (చా. మం-I పుట. 123).

14. వ. శతాబ్దిలో గృహరాజు మేడలనబడే ఒంటిస్తంభపు మేడలను నిర్మించారు.

ఏలెఁ గోమటి వేమన యిరువదేండ్లు
రాచ వేమన్న నాల్గు వర్షముల నేలె
మించి కట్టిరి *గృహరాజుమేడ* కొండ
వీట నూటేండ్ల రెడ్లు భూవిది తయఁపలు.

(చా. మం.-I. పుట. 31)

12. శకునాలు : కార్యార్థం బయలుదేరటానికి ముందు శకునాలు చూడడమన్నది మన దేశంలో అనూచానంగ వస్తున్న ఆచారం. సరస హృదయుడైన రాయన భాస్కరుడు ఎప్పుడు ఎవ్వరికి లేదనడు గనుక దుశ్శకునాలు కనిపించినా అర్థిజనం ఆగకుండ వస్తారట. వేటిని దుశ్శకునాలుగ మనవారు పరిగణించే వారో ఈ చాటువులో చక్కగ విశదీకరింపబడింది —

సీ. కదలి యిల్వెడలంగఁ గడపకాల్ దాకినఁ,
దల పాగ పందిటఁ దగులు కొన్న
ఎందుఁబోయెదవన్న, నేక విప్రునిఁగన్న,
నొంటిరోదనమన్న నుండమన్న
తగినచోఁ దుమ్మినఁ దంబళి యెదురైన
పీడిన తలవాని వీధిఁగన్న
బలిమిడిమిక్కిలి యొంటి కొమ్మెక్కినఁ
బలుఁగు పీచినఁ బొడపురుగుఁగన్న

గీ. మానకేతెంచు నర్థిసమాజములను
నిచ్చునిష్టార్థ వస్తువు లెలమితోడ
సరసహృదయుండు వినుకొండ శాసనుండు
భవ్యభరతుండు రాయన భాస్కరుండు.

(చా. మం-I. పుట 80)

తంబళి అంటే శివార్చకుడు. అతడు ఎదురు పడడం అశుభ సూచకంగ భావింపబడేది. "ఎచటకేఁగెదవని యెవ్వరు నడుగక, తంబళి బాపడు తారసిలక" అని ప్రబంధరాజు వేంకటేశ్వర విజయ విలాస ప్రయోగం. (ప. 760)

యాచమనాయని పోరులో అగచాట్లు పడిన 'బంట్రౌతులు'
"గుడినిఁ దుమ్మిరి కసుక్కున నిల్లు వెళ్లఁగాఁ
జాఁగీడుకలగంటి సన్న రేయి
పైనమైపోఁగానె పడియె నామపుఁబెట్టె
నపశకునంబు లెన్నైన నాయె"
అని చింతించారు. (చా.మం. III. పుట 305).

బయలుదేరినపుడు గడప కాలుకు తగలడం, తలపాగ పందిరిని తగులుకోవడం, ఎక్కడికి ప్రయాణమని ప్రశ్నించడం, ఏకవిప్రుడు కని పించడం, ఏడ్వడం, తుమ్మడం, తలవిరబోసుకున్న వానిని వీధిలో చూడడం, పక్షి రెక్కలు తగలడం, పొదపురుగు అంటే పాము కనిపిం చడం, నామపు పెట్టె పడడం మొదలైనవి అపశకునాలు.

13. మ్రొక్కుబళ్లు: ఆపద్మ్రొక్కుల దేవుళ్లు మనకు అనాదిగ ఉన్నారు. యుద్ధంలో చిక్కుకున్న ఒక యోధుడు తన ప్రాణాన్ని కాపాడ మని వేయి దేవుళ్లకు మ్రొక్కుతున్నాడు:

ఇల్లుఁజేరితినేని యిలు తీర్థములుగాఁగ
వచ్చెదనో కంచి వరదరాజ
బ్రదికితినేని యేఁబది మాసిదాసళ్ల
కద్ద నేతులు పెట్టు దౌబళేశ
గండంబు గడచితే కంబాని కొక కోడెఁ
గట్టెద సుమ్మీఁకఁ గదిరినాథ
ప్రాణానఁ జేరితే బంట్రోతు తన మింక
నెన్నఁడు నొల్ల నోపెన్నరాయ
యీసారి బ్రతికించవే నీకుఁ దన్నీరు
దాసుండ నగుదునో తంత్రి యనుచు
మ్రొక్కు...... (చా.మం. III పుట 280)

గ్రామదేవతలకు బలులిచ్చి పొంగళ్ళు పెట్టే ఆచారం కూడ ఉన్నది. 'పడ వీటి యల్లమ్మ, పల్కెడి వీర్లార పోతురాజయ్య, పుట్టలమ్మ, మున్మ కోటమ్మ, మహమ్మాయి, గురునాథుడు' మున్నగువారు గ్రామదేవతలు. వాళ్లకు-

"ప్రోవుఁడీ యేటేటఁ బొంగళ్ళు వెట్టించి
పొట్టేళ్లఁ గొట్టించి పట్టి కొలుతు
బంట్రౌతు కొలువంత పాపమెన్నఁడు వద్దు
చాలుఁబో యేడేడు జన్మములకు".

(చా. మం. III పుట. 305)

అని ఆ వీరులు ప్రాణభీతితో ప్రార్థించారు.

దృష్టి దోషం తగలకుండ జీడిగింజలతో దృష్టి తీసేవారు. (చా. మం. III పుట. 145)

ఒక రసికుడు ఒక రామతోటి తన మధురస్మృతులను తలపోస్తూ-

సీ. ...నే వేగఁజని బసలోఁగల
పనులెల్లఁ దీర్చి సాపాటుచేసి
గంధంబుఁబూసి వేడ్కలమించి కెలఁకుల
నమ్మలక్కలు వెఱగంది చూడ

గీ. నీటుగా వచ్చుచోఁ జూచి నేఁడు దృష్టి
తాఁకునని ప్రొద్దుగ్రుంకిన తత్క్షణంబు
జీడిగింజల దృష్టి తీసిన విధంబు
మఱచిపోవంగఁ దరమె రామాపధూటి!

(చా. మం. III పుట. 145)

అని నెమరువేసుకున్నాడు.

14. పిల్లల పెంపకం : పసిబిడ్డల ఆలన పాలనను గూర్చిన ప్రస్తావన కూడ చాటువుల్లో కనిపిస్తుంది. చిన్నారులకు స్నానంచేయించడం, ఉగ్గుపెట్టడం, చేదు పట్టడం, పాలు కుడుపడం ఆనాడు ఈనాడు సమానమే. నల్లపరాజ వంశాబ్ధి చంద్రుడైన సీతారామరాజు వాక్సుధా గరిమకు కారణం భారతీదేవి పెంపకమట-

గీ. పైడి గిన్నెను సుధనుంచి పాలుపితికి
యుంగరపు వ్రేలఁ గలయంగ రంగరించి
తొడలె పాన్పుగఁ దగునట్లు పడకమర్చి
బుగ్గపై గిల్లి పాడుచు నుగ్గు పెట్టి
పెంచెఁగాఁబోలు భారతి పిన్ననాడు!

"చేఁదుఁ బట్టేవేళ బిడ్డఁ చెలఁగి యేడ్చినా" ఆ తరువాత ఆ బిడ్డకది సుఖాన్ని చేకూర్చినట్లే అర్థి అడిగేవేళ కష్టమనిపించినా, ఆ తరువాత సౌఖ్యాన్ని పొందుతాడు. (చా. మం-II. పుట. 131)

ఈ కాలంలో Feeding Bottle స్థానంలో ఆ కాలంలో బొడ్డు బిడ్డలకు పాలు పోయడానికి 'పాలడలు' వాడేవారు.

(చా. మం-III. పుట 151).

కలిగిన వారింట్లో పొంబాలడలు ఉండేవి. పసిబిడ్డలు మారాం చేస్తున్నపుడు తల్లులు 'బూచోడొస్తున్నాడని' భయపెట్టడం కద్దు. అడిదము సూరకవి భార్య తమ ముద్దుబిడ్డను వర్ణించమని కోరితే, ఆకవి—

క. బాచా బూచులలోపల
బాచన్నే పెద్దబూచి పళ్లన్ దానున్
బూచంటె రాత్రి వెఱతురు
బాచన్నను జూచిపట్ట పగలే వెఱతుర్.

(చా. మం-III. పుట 129)

అని చాటువు చెప్పాడు.

15. ఆట పాటలు : బొమ్మలాటలు, గుజ్జనగూళ్లు, బొమ్మ పెండ్లిండ్లు అప్పుడు ఇప్పుడూ ఉన్నవే. ఈ ఆటలాడటానికి అలుపన్నది ఎప్పుడూ ఉండదు. పెదకోమటి వేమనకీర్తికాంతకు ధరణియె బొమ్మరిల్లు;

వసుధా వరపంక్తులే బొమ్మలు; అంబుధులు గురుగులు; చక్రవాళగిరి కోట; నభము సేస కోర (= పిడత, గిన్నె) నిర్ఘరగిరి గద్దెపీట; ఇనచంద్రులు మేటి నివాళి పళ్లేలు. అంటే పెద కోమటి వేమన కీర్తి దశదిశలు వ్యాపించిన దన్న భావాన్ని కవి చమత్కరించాడు.

(చా. మం-III. పుట 193)

రాజుల విధ్యుక్త ధర్మాలలో వేట ఒకటి. ఆ కాలంలో వేటను ఎలా ఆడేవారో ఈ చాటుకవి రూపకాలంకార విలసితంగా వివరించాడు. గన్నయ సాగిబైచడు బ్రహ్మాండభాండం దివెగూడుగ (= ప్రమిద) వీరరసమె చమురుగ. ప్రతాపర్క బింబమే తిరువత్తిగ, సంగరభూమియే వేటపొలంగ భేరీభాంకారాది పంచమహా శబ్దాలే గంటలుగ, కరవాలమె అంబుగ, రాత్రి పగలనక శత్రుమృగాలను వేటాడేవాడు.

(చా. మం-III. పుట 198)

తెలుగులో నాటక రచన 19. వ. శతాబ్దంనుండే జరిగినా నాటక ప్రదర్శనలు ప్రాచీన కాలంనుండి ఉన్నాయి. సంస్కృత నాటకాలను ప్రదర్శించి ఉండవచ్చు. వీటికి అనువైన నాటక శాలల్ని కట్టించేవారు. 'వసుధలోపల మంచెళ్లవారి యిల్లు శారదాదేవి నాటకశాలగ ఉండేదట."

(చా. మం.-III. 165)

16. దండనలు : ఆ రోజుల్లో శిక్షలు కఠినంగ ఉండేవి. బకాయిపడి, పన్నులు చెల్లింపలేనివారిని శిక్షించే వారు. "కవిరాజు కంఠంబు కౌగలించెనుగదా పురవీధి నెదురెండ పొగడదండ" అన్న చాటువులో పొగడదండ శిక్ష ప్రస్తావింపబడ్డది. మెడలో త్రాడునుగాని, గొలుసును గాని, దుప్పటిని గాని పెనవేసి, చెల్లింపవలసిన పైకం ఇచ్చేవరకు కదల రాదని ఆజ్ఞాపించడానికే 'పొగడదండ' అనేవారు. ఈ వివరణ నిరంకుశో పాఖ్యానంలో ఉన్నది. (నిరం. 3 ఆ. 26. ప.)

చేతికి వెదురు గొడియ తగిలించడం, నగరి వాకిటవున్న నల్ల గుండును భుజంమీద కెక్కించడం నిర్బంధితునికి విధించే దండనలలో కొన్ని.

రాజ్యాంగవ్యవస్థ: ప్రజల సంక్షేమార్థం చక్కని రాజ్యాంగ వ్యవస్థను రూపొందించినట్లు చాటువులలోని రాజపద్ధతి, కోశపద్ధతి, రాష్ట్ర పద్ధతి, దుర్గపద్ధతి, బలపద్ధతి వలన తెలుస్తుంది (చా. మం. I. పుట. 39-41). "తన భుజార్జితమైన యర్థంబుదెచ్చి, యాయమెఱిఁగి, వ్రయించుచు ననుదినంబు నరసి భండార మొడగూర్చునతడు రాజు."

17. ఆయుధాలు:- చాటువుల్లో రకరకాలైన ఆయుధాల ప్రసక్తి ఉన్నది. రాజుల బలపరాక్రమాలను, రణవిజయాలను వర్ణించడం చాటువులకు ప్రధానం గనుక వివిధ ఆయుధాలు ప్రస్తావింపబడ్డాయి. కత్తులు, కటారులు, ఈటెలు, బల్లేలు మొదలైన మారణాయుధాలేకాక తుపాకులు, ఫిరంగుల వంటి మారణ యంత్రాలను కూడా వారు ఉపయోగించారు. ప్రాచీనకాలంలో ప్రభువు సప్తాంగ సహాయుడు.

పరాజితులైన రాజుల బిరుదుల్ని ధరించడం, వారి ప్రతిమలను చేయించుకొని పాదాలకు ధరించడం అనే ఆచారం ఆంధ్రదేశంలో ఉండేది. దీనినే "బొమ్మవెట్టడం" అంటారు. చాటువులలోని ఆయా వంశావళుల బిరుదులను పరిశీలిస్తే ఈ విషయం వ్యక్తమవుతుంది. జక్కన విక్రమార్క చరిత్రలో కూడా ఈ ప్రస్తావన ఉన్నది. చాటువుల్లో మరొక ఆచారంకూడ కనిపిస్తుంది. వేంకటగిరి ప్రభువులు వెలుగోటి వారు. రావుదాచభూవరుడు తాను ఓడించిన శత్రురాజుల బొమ్మల్ని తన తమ్మపడిగంమీద చెక్కించాడు. దానిని కని చమత్కరిస్తున్నాడు.

క. తమ్మ తమకెంత ప్రియమో
తమ్మకుఁ జెయిసాఁచి రిపులు తలక్రిందైరీ

తమ్మ పడిగాన నుందురు
బొమ్మలక్రియ రావుదాచభూవరుసింగా!

(చా. మం. I. పుట. 58)

కాలిలో కట్టబడటంకన్న ఇది ఇంకా హీనమైనది. ప్రతిరోజు వారి ముఖాన్ని ఉమ్మివేయటాన్ని సూచిస్తున్నది.

18. వృత్తులు, ఉద్యోగాలు : ఆయా వృత్తులను, ఉద్యోగ ధర్మాలను తెలిపే చాటువులున్నాయి. చాటువుల్లో మంత్రులుగ ప్రస్తుతింప బడిన వారిలో కొందరు గ్రామకరణాలు కావచ్చు. ఆ కాలంలో గ్రామ కరణం ఇప్పటి మంత్రికి సమానం.

క. కరణము గ్రామాభరణము
కరణము తమవంక వారి కాభరణమ్మా
కరణము నృపునుపకరణము.
కరణముకలవార్థి చంద్రకరణము మల్లా!

(చా.మం-I.పుట. 92

నియోగులే ఈ కరణీకాన్ని నిర్వహించేవారు. వారు ఎంతటి శక్తి మంతులంటే-

ఉ. మేదినినాథుఁడల్గినను మించిన కార్యము చక్కసేయ స
మ్మోదమెలర్పఁగా గణకముఖ్యుని సఖ్యము లెస్స యెట్లనన్
ఆదటఁగాలుఁడల్గియు గతాయు వటన్నను జిత్రగుప్తుఁడా
'గా' దొలఁగించి 'శా' మొదట గక్కున వ్రాసి సజీవుఁ జేయఁడే

(చా. మం. I. పుట 207-208).

కంసాలులు, అగసాలెలు, కమ్మరులు ఆనాటి సమాజ అవసరాలు తీర్చేవారు. మైలమ భీమన ఖడ్గ సృష్టికి గరళపుముద్ద లోహము. మహాశని

కోట్లు సమ్మెటలు. హరుని నయనాగ్నియే కొలిమి. ఉరగాధిపుని కోరలు పట్టుకారులు. దిక్కరటి శిరముదాయి. కాలుడు కమ్మరి.

(చా. మం. III పుట 178).

తనకు రాయల దర్శనాన్ని కల్పించిన వానిని కందుకూరి రుద్ర కవి "ఇంగిత మెఱిఁగిన ఘనుఁడీ మంగల కొండోజి మేలు మంత్రుల కన్నన్" అని మెచ్చుకున్నాడు. క్షురకర్మ అప్పుడూ ఉండేది.

(చా. మం. III. పుట 112).

చాకలి వాని సమస్య ఎప్పుడూ ఉన్నదే. చాకలివాని బాధను ఒక కవి ఈ చాటువులో చమత్కరించాడు :

గీ. చాకివానితోడ జగడాలు పడలేక
సిరిగలాఁడు పట్టుచీరగట్టె
శివుఁడు తోలుగప్పె, సీయని మదిరోసి
భైరవుండు చీర పాఱవైచె.

(చా. మం. II. పుట. 128)

శ్రీనాథుడు వర్ణించిన వివిధ కులాల అంగనల వలన వృత్తి విద్యలను వారు ఉపేక్షించలేదని తెలుస్తుంది. బట్టలునేసే 'కుసుమసాయకు పట్టపుదంతి' అనదగిన సాలెత కనుపించింది (చా. మం. I. పుట. 133). ఆవం దగ్గర "కుమ్మర వారి బాలిక" "విటతండము గుండియలార విచ్చగ" దర్శనమిచ్చింది. చాకలి చిన్నదాని చక్కదనం చక్కలిగింతలు పెట్టింది. దేశం నాలుగు చెరగులు కలియదిరిగిన కవిసార్వభౌమునికి ఇన్ని పనులలో ఒక్క పనినైనా చేసిన పురుషుడు కంటబడక పోవడం అతని సౌందర్య ప్రియత కావచ్చు. కాని ఇందులో ఒక నిగూఢ సత్యమున్నది. అప్పుడుకూడ ఆడవారు నడుంవంచి మగవారితో పాటు సమంగ పని చేసారు.

ఆంధ్రప్రదేశ్ చేనేత వస్త్రాలకు ప్రసిద్ధిగన్నది. కదురాడిన కవ్వ మాడిన ఇంటికి దరిద్రమెన్నడు ఉండదంటారు. "రంభయైన యేకులె వడకున్" అనటం వలన ఆ సీమలో స్త్రీలందరు వడికేవారని తెలుస్తుంది. దూదిని ఏకే తెగకు పింజారులని పేరు. వీరిని దూదేకులవారని కూడ వ్యవహరిస్తారు. శ్రీనాథుడు-

ఉర్వీమెరయించు కార్పాస పర్వతంబు
చేరి మర్దించె నొక్క పింజారితరుణి (వీధి నాటకము)
అని పింజారులను ప్రస్తావించాడు.

వ్యాపారం చేసేవారిలో బలిజలు, కోమట్లు ముఖ్యులు. పూర్వం బలిజలకే సెట్టి అనే బిరుదం ఉండేది. వ్యాపారాన్ని ఎక్కువగ వైశ్యులు నిర్వహించేవారు. మోసగాండ్లయిన కోమట్లను తెగతిట్టాడు భీమన. నల్ల బజారు అప్పుడూ ఉన్నది.

చ. గొనకొని మర్త్యలోకమునఁ గోమటి పుట్టఁగ బుట్టెఁ దోనబొం
కును గపటంబు లాలనయుఁ గుచ్చిత బుద్ధియు రిత్త భక్తియున్
ననువరిమాటలున్ బరధనంబును గ్రక్కున మెక్క జూచుటల్
కొనుటలు నమ్ముటల్ మిగులఁ గొంటుఁదనంబును మూర్ఖవాదముల్.
(చా. మం. I. పుట. 111)

అంగళ్ళు, దుకాణాలలో వస్తు విక్రయం జరుగుతుండేది.

ఇక వ్యవసాయం కోస్తా ప్రాంతాలలో ముక్కారు పంటను పండించేవారు. నెల్లూరు ప్రశస్తిని పొగడుతూ "ఏపట్టణంబున రూపింప నన్నియు, నీరేడు బావులింపారుచుండు; ఏ పట్టణంబున నేకాలమును బెన్నఁ కాల్వలచేత ముక్కారుఁబండు" అని ప్రస్తుతించాడు. (చా.మం. I. పుట. 28)

పంటలధికంబు గుంటూరు ప్రజలకెల్ల
పాడిబాసలు గలిగుండు తాడికొండ. (చా.మం. II. పుట. 118)

సిరిమించు మారెళ్ల సీమ దేశంలో దువ్వభూమి. ఆ భూమి పంటలు ఆరికె, కందులు, చామలు, ఉలవలు, సజ్జలు, కొఱ్ఱలు, వరిగలు, అలసందలు, అనుములు, పెసర, అముదాలు, ప్రత్తి, రాగులు, పాశెపు జొన్నలు, పదునాల్గు పన్నెల పంట పండుతుంది. అందు కూరగాయలు అనువైన గోంగులు, పుచ్చకాయ, తుమ్మి పులుసుకూర, పాలు పెరుగు, నేయి పరిపాటిగ ఉంటవి. (చా. మం. II. పుట. 118)

గోదావరీతీర కళసాపుర ప్రాంతం కదళీవనాలతో, ద్రాక్షలతా స్తబకాలతో నిండివుండేవి. (చా. మం. III. పుట. 190)

పాలకొండ ప్రాంతాన్ని దర్శించిన అడిదము సూరన "అక్షీణేక్షురంభాటవీస్తోమములు, బహుశాలిధాన్యతతులు, ఎచ్చోటన్ నదీమాతృక గ్రామంబులు, ధరంజూడగాఁ క్షామంబన్నది లేదు క్షీరగిరిదేశంబందు నెందేనియున్" అని చెప్పాడు. (చా.మం. III పుట 131).

నదులు, కాలువలు లేని ప్రాంతాలలో ఏతాములతో నీళ్ల తోడి సేద్యం చేసేవారు. కార్యాన్ని సాధించాలనుకున్న వాడుతగ్గినావాడు అల్పుడు కాడు ఏతాములాగ.

క. చేతనగు వాఁడుకార్యము
కై తగ్గును వంగుఁ గాక యల్పుండగునా?
యేతాము చడిదావంగును
బాతాళము నీరు దెచ్చి బయలంజల్లున్.

తెలంగాణంలో తరీ (మాగాణి) సేద్యం ఇప్పటికీ ప్రధానమైనది (చా.మం. I పుట 17). కనుక రాజులు, మంత్రులు, ధనికులు కుంటలు,

కాలువలు, చెరువులు విశేషంగా నిర్మిస్తూ ఉండేవారు. ఈ మాగాణి సేద్యానికి ఏతము, మోట, చెరువు, కుంటల ద్వారా నీరు పారించేవారు.

అడిదము రామకవి చెఱువు నిండి పంట పొలాలలోకి నీరు పారి ముంపువస్తే, గంటం చేతబూని నీటి ముంపులో దిగి, గంగాభవానిని స్తుతిస్తూ పద్యాలు వ్రాసి నీటిలో విడిచాడు. పొగడికకు లొంగని గంగపై తిట్టుతూ 4 సీస పద్యాలు చెప్పాడు. ఈ తిట్లదాటికి తట్టుకోలేకేనో అన్నట్లు ఆ చెఱువు గండి తెగి, నీరు పల్లానికి పారింది. (తెలుగులో తిట్టు కవిత్వం-పుట 59).

రాజులచే నియుక్తులైన వివిధ ఉద్యోగులు కూడ ఉండేవారు. దళవాయి, కావలివాడు, తలారి, వాకిలివాడు, దొరలు, సామంతులు, దుర్గాధిపతులు, నియోగములవారు అని వివిధ ఉద్యోగులు ఉండేవారు. రాయల వాకిటి కావలి తిమ్మని గూర్చిన ఒక ఉదంతం ఉన్నది. రాజుగారెప్పుడో ఆతనికి ఒక మంచి సేలువ నిచ్చారట. దానిపై కన్ను వేసాడు రామకృష్ణుడు. దానిని సంగ్రహించడానికి ఒక ఉపాయం పన్నాడు. "రాయల ద్వార పాలకుడవై ఉండి, నీవు ఒక్క పద్యాన్నయినా కృతి నందకపోవడం ఏమీ బాగులే''దన్నాడు. తిమ్మడన్నాడు "అయ్యా! తగినంత బహుమానం ఇయ్యక కవులు పద్యాలు చెప్పుతారా'' అని. రామకృష్ణుడు ఉపాయం చెప్పాడు. ఒక్కొక్క కవి నడిగి ఒక్కొక్క పాదాన్ని తీసుకోమన్నాడు. తిమ్మడు సంతోషించి మరునాడుదయం వాకిట్లో నిలిచి మొదట వచ్చిన పెద్దనకు తన కోరికను తెలిపితే, ఆయన నవ్వి-

"వాకిటి కావలి" తిమ్మా అని మొదటి పాదం చెప్పి వెళ్ళిపోయాడు. తరువాత వచ్చిన భట్టుకవి''ప్రాకటమగు సుకవివరుల పాలిటిసొమ్మా"అని పూరించాడు. ఆ తరువాత వచ్చిన తిమ్మన "నీకిదె పద్యము కొమ్మా'' అని

చెప్పి పోయాడు. ఆ ముగ్గురు వచ్చి పోవడాన్ని కనిపెట్టి ఉండిన రామ కృష్ణుడు నాలుగవ వాడుగ వచ్చి "నాకీ పచ్చడమె" చాలు నయముగ నిమ్మా. అని పూర్తిచేసేసరికి పాపం తిమ్మడు సేలువను ఇచ్చివేసాడట.

(చా. రత్నా. పుట 17-18).

ఆనాటి సమాజంలో వేశ్యలు ప్రముఖ స్థానం వహించారు. వారు సామాన్య గణికలు కారు. విదుషీమణులుగ కనిపిస్తారు. ఒక అనామకు రాలైన వారకాంత రాయల ఆస్థానాన్ని సందర్శించినట్లు ఒక కింవదంతి. ఈ చాటువుకు సంబంధించిన గాథ బ్రౌన్ సేకరణలో ఉన్నది. ఆమె అష్టదిగ్గజాలకు "మీరును మీరు మీరు మఱి మీరును మీరును మీరలంద ఱున్" అన్న సమస్య నిచ్చింది. దానిని వికటకవి రామలింగడు :

ఉ. కోరిక లుప్పతిల్ల మది గోరిన యట్టి కళా విశేషముల్
చారు తరంబులన్ రతుల సల్పఁగ నేర్చిన యట్టి జాణ యీ
వారవధూ శిరోమణిని వంతులు వేసుక దెబ్బతీయఁడీ
మీరును మీరు మీరు మఱి మీరును మీరును మీరలందఱున్.

(తెలుగులో చాటు కవిత్వము-పుట 247)

అని పూరించాడట.

19. పండగలు-పబ్బాలు : పండగలు, శుభ కార్యాలు జరిపే విధానంలో పెద్ద మార్పేమీ కనిపించదు. అప్పటివారి ఆచారాలు, ఇప్పటి వారి నియమాలు సమమే. కాకపోతే కాలాన్నిబట్టి కొంత సర్దుబాటు. ఆ నాటి భోగి పండగ వేడుకలను ఈ చాటువులో చూడవచ్చు :-

సీ॥ భోగి పండుగ వచ్చెఁ బొందుగా మన యిండ్ల
తలయంట్లు సాగింపవలయు నేఁడు
ఎల్లి సంక్రాంతియు నెల్లుండి కనుమావ
లెల్లుండి ముక్కను మేఁగుదెంచు

డండిగా నిన్నాళ్ళు పిండి వంటలతోడ
నిష్టమృష్టాన్నంబు లింపుమీఱ
బావలు మఱదులు బందుగు లల్లుండ్రు
పదినెలు మఱఁదండ్రు బంతిగుడిచి
గీ॥ క్రొత్త పుట్టముల్ ధరియించుకొని ముదమున
గూడి కిలకిలలాడుచు వేడుకలర
పాడుదము పాట ఆటలాడుకొంద
మోలి మన మెల్లరము గూడి బాలులార.

(చా. మం-II. పుట 112)

బావమఱదుల సరసాలతో, పిండివంటలతో, పిల్లల ఆటపాటలతో ఆనందంగ పండగను ఆచరించేవారు.

వినాయకుని చవితినాడు సిద్ధి విఘ్నేశుని 21 పత్రాలతో, పప్పు, పాయసం, నానఁబ్రాలు, తేనె, నేయి, ఉండ్రాళ్ళు, కుడుములు ఉపాయ నంతో పగటివేళ భక్తితో పూజించేవారు. (చా.మం-II. పుట 121-122)

హైందవ సమాజంలో పెండ్లి పేరంటాలు ప్రధానమైనవి. గుణము, కులము కలిగిన వరునికి కన్యాదానం చేయడం ఒక పుణ్యకార్యంగ భావి స్తారు. ముహూర్తం నిర్ణయించి వియ్యాలవారిని యెట్టి మర్యాదలతో పిలిచే వారో ఈ క్రింది చాటువులో విదితమవుతుంది. దశరథ మహారాజులకు జనకధాత్రీశులవారు వ్రాసిన లేఖ-

సీ. శ్రీమత్సకల గుణ శ్రేయోర్థ సంపన్ను
లయిన శ్రీరాజాభ్యుదయ సమృద్ధి
మన్మహామేరు సమానధీరులయిన
దశరథేశ్వరులకుఁ దాల్మితోడ

జనక మహారాజు సాష్టాంగములుచేసి
వేడ్కఁ జేయంగల విన్నపములు:-
ఇక్కడ శుభము మీ యొక్క సంతోషంబు
వ్రాయించి పంపించవలయు నుండి

తరువాత :-
శ్రీరామ ధాత్రీశునకుఁ జైత్ర
శుద్ధ పంచమినాఁడు సౌంపుమీఱ
మా పటి లగ్నాన మా పట్టి సౌభాగ్య
వతి సీత నిచ్చి వివాహమహము
ఇక్కడ మిథిలలోనే చేయఁ బెద్దలు
నిశ్చయించిరి గాన నిండువేడ్క

గీ॥ సహ కుటుంబము పరివార సహితముగను
విభవమున వచ్చి మీరలీ శుభముహూర్త
మెలమిఁజేయించి ప్రమదంబు కొలుపవలయు
వెలయఁగానివె పది వేల విన్నపములు.

(చా. మం-II. పుట 146-147)

20. మందులు మాకులు : మానవజాతి మనినంతకాలం రోగాలు, రొచ్చులు నీడలా వెన్నంటి ఉంటాయి. ఒకానొక సమయంలో శ్రీనాథునకు జబ్బుచేస్తే వైద్యులు ఉలిమిరి చెక్కతో ఔషధమిచ్చి రొట్టె పథ్యంపెట్టి, గాలి తగలనిచోటు పడుకోబెట్టారు. ఆ చీకటి గదిలో బాధతో పడుకొని, బుద్ధి వచ్చునట్లీ చాటువు చెప్పుకున్నాడు-

చ. ఉలిమిరిచెక్కయున్ మిగుల నుక్కయు జప్పని రొట్టెముక్కయున్
మలినపుగుడ్డలున్ నులకమంచపుఁగుక్కియు జీఁకటింటిలోన్
దలఁచిన రోఁతపచ్చునొకనాఁటి సుఖంబొక యేఁటి దుఃఖమౌ
...... (చా.రత్నా. పుట. 10).

అని అనుభవం నేర్పిన పాఠంతో మరొకమారు ఈ గండాన్ని తప్పించుకొని "గండము దప్పెనాంధ్ర కవిగానికి నిప్పటిరేయి" అని సంతోషించాడు. (చా. మం-I. పుట 133)

కవులు కవిత్వాన్ని చెప్పటమే కాక కాయచికిత్సలు కూడ చేసే వారు. అళియ రామరాయలకు వాయురోగం వస్తే రామలింగడు అంతఃపుర స్త్రీలతో ఇలా చెప్పాడు:

క. ఓయమ్మలార మందులు
వేయేల మకార కొమ్ము విషకవిగానిన్
వాయెత్తకుండఁ జేసిన
వాయెత్తదు రామరాయ వసుధేశునకున్.

(చా. మం-III. పుట 124)

మకార కొమ్ము విషకపి = మూర్తి కవి; వాయి = వాయురోగము.

బుక్కపట్నం తిరుమల తాతాచార్యులవారు తెలుగు విశ్వగుణా దర్శకర్త. ఈయన బూతు పద్యాలు చెప్పడంలో ప్రసిద్ధుడట. వైద్యాన్ని కూడ చేసేవాడు. తన దగ్గర రోగం కుదర్చుకొన్న అచ్చన్న అన్న ఒకడు తానిస్తానన్న యీవి యీయకపోతే ఈ చాటువును ఆచార్యుడు చెప్పాడు:

క. పచ్చడము దుప్పటాయెను
విచ్చలవిడి తులసి పత్రి విడియంబాయెన్
అచ్చల నగుబాటాయెను
అచ్చన్నా! నీదుకీర్తి యట్టిట్టాయెన్.

21. చదువు సంధ్యలు : విద్య ప్రాధాన్యతను ఆకాలంవాళ్లు చక్కగా గుర్తించారు.

గీ. అక్షరంబు వలయుఁ గుక్షిజీవనులకు
నక్షరంబు జిహ్వ కిక్షురసము

అక్షరంబు తన్ను రక్షించుఁ గావున
నక్షరంబు లోక రక్షితంబు. (చా. మ-I. పుట. 16)

అప్పుడు అచ్చుయంత్రాలు, ముద్రాక్షరశాలలు లేవు. లేఖకులే గ్రంథాలను ఎత్తి వ్రాసేవారు. లేఖకులను గూర్చిన చాటువులు, అక్షర రమ్యతను చాటేవి ఉన్నాయి. ఆదిలో తాటాకులు, గంటాలే వ్రాత సాధనాలు. గంటాలను నానా విధాలుగా తయారు చేసేవారు. వ్రాయని కొనకు ఆకులు చెక్కడానికి అనువుగా కత్తిగానో- ఈ కాలవు paper knife అందమైన రేఖలతోనే సిద్ధం చేసేవారు. సంపన్నులు బంగారు గంటాలతో వ్రాసేవారు.

కలము పసిండిగంటమున కాటయవేము సమక్షమందు, స
త్ఫలముగ రాయస ప్రభుని బాచఁడు వ్రాసిన వ్రాలమోతలన్
గలు గలు గల్లు గిల్లురన కంటక మంత్రుల గుండెలన్నియున్
జలు జలు జల్లు జల్లురనె సత్కవివర్యులు మేలు మేలనన్.

వేగంగ వ్రాయడం, ముత్యాలులా ముద్దుగ వ్రాయడం తాటాకుల గ్రంథాలకు చాల అవసరం. కాటయ వేముని వ్రాయసకాడైన (రాయసం) బాచ మంత్రి అక్షర రమ్యత గొప్పగ పొగడ్త కెక్కింది.

కాగితాల వాడుక శ్రీనాథుని కాలానికే ప్రజలకు తెలుసు. "దస్త్రాలుం మసిబుర్రలున్ కలములుం దార్కొన్న చింతంబళుల్" మున్నగు వాటిని శ్రీనాథుడు ప్రస్తావించాడు. కాగితాన్నే ప్రత్యేకంగ వర్ణించిన చాటువులున్నాయి. (చా. మం-III. పుట 165)

తిరుపతి వేంకటకవుల కాలానికి విజయనగరంలో కాలేజి వెలసింది. "దీనపోషకుఁడన్న తేటమాటకు మహారాజ! నీసగరి కాలేజి సాక్షి" అన్నారు. (నానారాజ సందర్శనం- పుట 15. ప. 78)

22. నాణ్యాలు :– నాణ్యాల ప్రసక్తి కూడ చాటువుల్లో చూడ వచ్చు. వాసిరెడ్డి వేంకటాద్రినాయడు "వరహాల్కానుల భంగి" "రూపాయలున్ మఱి గవ్వలవలె" దానం చేసేవాడు (చా.మం-I. పుట 67). వేంకటాద్రినాయని కాలం 16 వ శతాబ్ది ఉత్తరార్థం. అప్పటికి ఈస్టిండియా కంపెనీవారు తమ నాణ్యాలను చెలామణిలోనికి తెచ్చారు.

గుంటుపల్లి ముత్తయ మంత్రి "పదివేల మాడలు" అర్థిజనానికి ఆర్తితో ఇచ్చేవాడు. మాడ, కర్షము, పలము మున్నగు నాణేలు 15 వ శతాబ్దిలో వాడుకలో నున్నట్లు సింహాసన ద్వాత్రింశికవలన తెలుస్తుంది. (7 ఆ. 14. ప.).

4 మాడలు = 1 కర్షము
4 కర్షములు = 1 పలము
100 ఫలములు = 1 తుల
20 తులాలు = 1 భారము

(ఆంధ్రసాహిత్యము-సాంఘిక జీవన ప్రతిఫలము పుట 161)

ధాన్యాన్ని కుంచెలు, మానెలు అన్న పరిమాణాల్లో కొలిచేవారు. భూమికొలతలు మూరలు, బారల లెక్కలో ఉండేవి.

శకవత్సరం వేయునన్నూట యెనుబదియును జనునెడ, జయాబ్దంలో మాఘమాసం శుద్ధ పంచమినాడు మల్కిభరామనరవరుడు కందుకూరి రుద్రకవికి రెంటచింతలలో "పదేను కుచ్చెళ్ల పొలాన్ని" మాన్యంగ దానం చేసాడు.

4 మూరలు = ఒక బార
4 బారలు = ఒక గడ

400 గడలు = ఒక కుంట

100 కుంటలు = ఒక కుచ్చెల లేక ఖండిక లేక తూప.

(ఆంధ్రుల సాంఘిక చరిత్ర - పుట 130)

పన్నుల్ని టంకాలలో చెల్లించేవారు.

కృష్ణవేణమ్మ గొనిపోయె నింత ఫలము
బిలబిలాక్షులు తినిపోయెఁ దిలలు పెసలు
బొడ్డుపల్లెను గొడ్డేటి మోసపోతి
నెట్లు చెల్లింతుఁ దంకంబు లేడునూట్లు

అని శ్రీనాథుడు దుఃఖించాడు.

23. దానధర్మాలు: దేశం సుభిక్షంగ, ప్రభువ్వులు త్యాగ నిరతులుగ ఉండినందు వలన నానావిధాలైన దానాలను వారుచేసారు. అన్నదానం, ఉదకదానం, వస్త్రదానం, సువర్ణదానం, గోదానం, భూదానం, కనక దానాలు ముఖ్యమైనవి [చా. కుం. III - పుట 203]. ఇంకాకొంచెం కలిగినవారు కన్యాదానం, గజదానం, షోడశదాన, మహాదాన, విశేష దానాలను చేసేవారు. [చా. మం. III. పుట. 246]. అయితే రాయన భాస్కరుడు చేసిన దానాలు విచిత్రమైనవేకాక, నభూతో నభవిష్యతి అని చెప్పదగినవి. అతిథికోట్లకు అమృతాన్న సత్రాలు, అన్నాతురులకు అంబలి సత్రాలు, ఆచార్యులిండ్ల రామానుజసత్రాలు, శిరస్స్నానానికి నూనెసత్రాలు బాలకులకు బాలసత్రాలు, జలకమాడటానికి జలస్పృష్టి సత్రాలు, ధన్యులకు తాంబూల సత్రాలకు వినుకొండలో నెలకొల్పాడు తాంబూల సత్రం కొంత విడ్డూరమైనదే. ఇదొక క్లబ్బునంటిది అనుకోవచ్చు, అన్నింటికన్న అద్భుత మైనది విటగ్రామణులకు కామసత్రాలు పెట్టడమే. ఆనాటి నెఱదాతల దాననిరతి అటువంటివి. ఆత్మకింపైన భోజనం మాత్రమేకాదు. మనస్సానందాన్ని కలిగించీ మగువను కూడ ప్రసాదించే విశాల హృదయులు రాయన భాస్కరుడు ప్రజలపట్ల అక్కరచూపే ప్రజానాయకుడు.

ఆ కాలంలో కవులు కేవలం ఇటువంటి దాతలను ఆశ్రయించి ఉండేవారు. ''నిరాశ్రయా నశోభంతే పండితా వనితాలతాః' కదా! వారికి నలుగురిని అడిగితెచ్చుకుంటేనే గాని డొక్కాడేదికాదు. డొక్కాడితేగాని రెక్కాడి కావ్యాలు ప్రభవించేవికావు. అందుకే శ్రీనాథుడు''దాతలెన్నంగను సున్నగాన పలినాటికి మాటికిం బోవనేటికిన్'' అని ఆక్షేపించాడు. (చా. మం. I. పుట. 125). అడిదము సూరకవి సంవత్సరంలో అయిదారు మాసాలు దేశాటనం చేసి, సంపన్నులను, సంస్థానాధీశ్వరులను సందర్శించి, వర్షాశనాలు గ్రహించి జీవయాత్ర సాగించేవాడని 'గరిసెలు వ్రాతగాని, మటిగంటెఁడెఱుంగము' అన్న చాటువువలన తెలుస్తుంది.

24. వర్ణవిభేదాలు-జాతివైషమ్యాలు: ఈరోజుల్లో రాజకీయపార్టీ విద్వేషాలకు వలె ఆరోజుల్లో నియోగి, వైదిక శాఖావైషమ్యాలు, బ్రాహ్మణ, బ్రాహ్మణేతర కవుల వివాదాలు చాటువుల్లో ప్రత్యక్షంగ ప్రతిఫలించాయి. శ్రీనాథుడు భంగ్యంతరంగ రాజమహేంద్రపర వైదికులను దూయబట్టాడు (చా. మం. I. పుట 129). ఈస్పర్థలు అడిదముసూరకవి, రేకపల్లి సోమప్ప చాటువుల్లో స్పష్టంగ కనిపిస్తాయి.

క. చెన్నగు నియోగికవనము
మిన్నగ వైదికున కబ్బమిగులునె చెపుఁడీ
జున్నురుచి వెన్నకబ్బునె
తన్నుకచచ్చినసుగాని ధరలో నరయన్.

అనిసూరన వెక్కిరిస్తే,

క. ఇలలో వైదిక విద్వ
త్తిలకంబుల కేమిదిక్కు దెలిపితివమ్మా
జిలిబిలి పలుకుల వెలఁదీ
పలుగాకి నకారగుళ్ళపాలై తిగదే

అని సోమప్ప కొక్కిరించాడు.

తిరుపతి వేంకటకవుల, కొప్పరపు సోదరకవుల, రామకృష్ణకవుల విద్యాస్పర్థలు జగమెరిగినవే. తిరుపతి వేంకటకవులు-

క. వెలనాఁటి వాఁడఁ గవితకు
వెలనాటిన వాఁడ పట్టివెలనాటినిగా
నెలమిన్ ద్రవిడుల కన్నను
వెలనాఁటులె తెలుఁగుఁ గయితవిందులు తలపన్.

(నానారాజసందర్శనము. పుట140. ప. 543).

తెనాలి రామకృష్ణుడు-

క. చీఁపర పాఁపర తీఁగలఁ
జేఁపల బుట్టల్లినట్టు చెప్పడు నీ యా
కాఁపుఁగవిత్వపుఁగూఁతలు
బాఁపన కవి వరుని చెవికిఁ బ్రమదంబిడునే.

(చా. మం. I. పుట. 148).

అని భట్టుమూర్తిని ఈసడించడానికి కారణం అబ్రాహ్మణ విద్వేషం. కాని యిప్పుడు కాలం మారింది. దృక్పథం మారింది. విలువలుమారాయి. అయినా ఈర్ష్యాసూయలు, నిందా అవహేళనలను మానవుడింకా అధిగమించ లేదు. ఈ కాలంలో అవి మరొక రూపంలో సాక్షాత్కరిస్తున్నాయి.

తిరుపతి వేంకటకవుల దగ్గరనుండి ఆధునిక సమాజ జీవనం చాటువుల్లో ప్రతిఫలిస్తుంది. వారి 'నానారాజ సందర్శనం'లో రైలుబండి పొగలు, రైలుఖర్చులు, దుర్గంధయుత పట్టణాలు, దోమలతో సంగ్రామాలు ప్రత్యక్షమవుతాయి.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఆంధ్రనాయకులను గురించి. అభ్యుదయ కవులను గురించి వ్యంగ్య చాటువులను చెప్పారు.

మాధవపెద్ది బుచ్చి సుందర రామశాస్త్రిగారి 'శృంగారచాటువు'లు ఆధునికుల జీవితానికి దర్పణం పట్టాయి.

ఏ పనులు దప్పినను గాని రేపుమాపు
మాకెనీమా సినీమాలు మాటదప్ప
దేలకడు(జెప్ప, నేటి టాకీలగూర్చి
హస్కు గొట్టగలేని కోన్‌కిస్కలేడు.

(శృంగార చాటువులు. పుట. 30).

ఇలా తెలుగు చాటువుల్లో ఆనాటినుండి ఈనాటివరకుగల ప్రజా జీవన రేఖ తళుక్కు మంటూనే ఉన్నది. కావ్యాలలో సాంఘిక జీవనాన్ని కవి పరోక్షంగనే చిత్రించగలడు. చాటువుల్లో అది ప్రత్యక్షంగానే సాక్షాత్కరిస్తుంది. చాటుకవులకున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కావ్య ప్రబంధ కవులకు లేవు.

ప్రజా జీవనాన్ని, సాంఘిక వ్యవస్థకు ప్రతిఫలించిన రచనలు చాటువులు. ప్రజల రసజ్ఞతను, త్యాగగరిమను, మత ఆచార వ్యవహారాలను, వేష భాషలను, ఆటపాటలను, విందులు వినోదాలను చాటువులు చమత్కారంగ చిత్రికపట్టాయి. ఇవి తడవని విషయమంటూలేదు: నల్లి, పిల్లుల వంటి అల్పవిషయాలను గూర్చి కూడ చాటువులల్లారు. కనుక సాంఘిక చరిత్రకు చాటువులు ప్రధానమైనవి. ప్రయోజనకారులు.

ఆధార గ్రంథాలు

		సంకేతములు
ప్రభాకరశాస్త్రి, వేటూరి-చాటు పద్య మణిమంజరి	(1917)	చా.మం-I.
,,	(1922)	చా.మం-II.
,,	(1952)	చా.మం-III.
పిచ్చయ్యశాస్త్రి దీపాల-చాటుపద్య రత్నాకరము		చా. రత్నా.

ప్రసక్త గ్రంథాలు

లక్ష్మీరంజనం, ఖాలేందు శేఖరశర్మ, ఖండవల్లి — ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి.

ప్రతాపరెడ్డి, సురవరము — ఆంధ్రుల సాంఘిక చరిత్ర.

వేంకట సత్యరామారావు, నండూరి — ఆంధ్రుల సాహిత్యము-సాంఘిక జీవన ప్రతిఫలనము.

ద్వారస్వామి శర్మ, రావూరి — తెలుగులో తిట్టు కవిత్వము.

తిరుపతి వేంకటీయము — నానారాజ సందర్శనము.

బుచ్చిసుందర రామశాస్త్రి, మాధవపెద్ది — శృంగార చాటువులు.

తెలుగు వ్యాకరణాలలో ప్రయోగ ప్రదర్శన

—డాక్టర్ జి. లలిత

తెలుగు వ్యాకరణాలలో ప్రయోగ ప్రదర్శన

ప్రాచీన తెలుగు సాహిత్యమంతా ఇంచుమించు సంస్కృత సాహిత్యానికి అనువాదంగానో, అనుకరణగానో వెలసింది. సంస్కృతంలోని అలంకార శాస్త్రమంతా తెలుగులోనికి యథాతథంగ దిగుమతి అయింది. ఛందో విషయంలో సంస్కృత చ్ఛందస్సును కొంత స్వీకరించినా, తెలుగువారిది అనదగిన దేశిచ్ఛందస్సును తెలుగు ఛందో గ్రంథాలు గుర్తించాయి. ఇక తెలుగు వ్యాకరణాల విషయంలో సంస్కృత సంప్రదాయానుకరణం అధికంగా కనుపించినా తెలుగు వ్యాకర్తలు తమదైన సంప్రదాయాన్ని కూడా కొంత నెలకొల్పారు. వాస్తవానికి తెలుగు వ్యాకరణాలు సంస్కృత వ్యాకరణాల ఒరవడినే వెలువడినా ప్రాచీన తెలుగు వ్యాకరణాలలో ప్రక్రియ, 'పరిభాష' లక్ష్యలక్షణ ప్రదర్శన మొదలైన అంశాలలో కొంత అమూలకత, ప్రత్యేకత కనిపిస్తుంది. తెలుగు వ్యాకరణాలలోని లక్ష్యనిర్ణయ విధానం, ప్రతిపాదించిన సూత్రాలకు ప్రదర్శించిన ఉదాహరణలు, కావ్య ప్రయోగాలు మొదలైనవాటికి సంబంధించిన విశేషాలే ప్రసంగ విషయాలు.

1. ప్రాచీన తెలుగు వ్యాకరణాలకు ప్రేరకాలు, పోషకాలు సంస్కృత వ్యాకరణాలే. అందులోనూ పాణిని అష్టాధ్యాయినే తెలుగు వ్యాకర్తలు ప్రమాణంగ స్వీకరించారు. పాణినీయంలో లక్షణమే కాని ప్రతిలక్షణానికి లక్ష్యప్రదర్శనముండదు. 'లక్ష్యలక్షణం వ్యాకరణమ్' అనే సూక్తిని పాణినీయానికి అన్వయించలేము. తమ అనుశాసనాలకు

(హలం. సూ. 1) పయఃప్రభృతులు (హలం. సూ. 9) రంజి, వస్త్యాది (క్రియ. సూ. 4.) గణాలు; రై, నావ. (అజం. సూ. 63.) గ్లౌ (అజం. సూ. 64) భూ, దివ్ (అజం. సూ. 65) రాజన్ (హలం. సూ. 8) అనే నిపాతరూపాలు ఉదాహృతాలు. ఇవి ప్రత్యక్షంగ కనిపిస్తున్న లక్ష్యాలు.

చింతామణి సంస్కృతభాషలో రచింపబడిన వ్యాకరణం గనుక అందులో పరోక్షంగ మరికొన్ని పదాలు ఉదాహరింపబడ్డాయి.

''తద్ధర్మ ఉతః''-తద్ధర్మార్థక విశేషణం యొక్క ఉకారం అంటే వచ్చున్, చేయున్ వంటివని అర్థం అవుతుంది. అలాగే ''అపి శబ్దార్థస్యేతః'' - అపి=ఏని శబ్దం యొక్క ఇకారానికి (సంధి. సూ. 10), ''తచ్ఛాబ్దతః''-తచ్ఛబ్దాలు అయిన 'అది, అవి' అనేవాని అత్తుకు, (సంధి. 14), ''తదాద్యర్థవా''-తదాదులు అంటే అప్పుడిప్పుడనే శబ్దాలు, (సంధి. సూ. 15), ''దారాదేః''-దార అంటే అలు. అలు మొదలైన శబ్దాలు (అజం. సూ. 73). ''యుష్మదస్మదాత్మభ్యః'' - నీ, నా, తా అనునవి (హలం. సూ. 26), ''ఓయి'' ఆమంత్రణంలో వస్తుందని (అజం.సూ.8), ఆత్మన్ శబ్దానికి, ఇమన్నంతాలకు డాప్రత్యయం వికల్పమని (హలం. సూ.7) చింతామణి పేర్కొన్నది. చింతామణిలో ఉదాహృతమయిన యీ ప్రయోగాలు కావ్యప్రయోగాలే కావచ్చు. ప్రాఙ్నన్నయ యుగపు కావ్యాలు అలభ్యాలు కనుక వీటి ఆకరాలు తెలియడంలేదు.

5. చింతామణి తరువాతి వ్యాకరణం అథర్వణకారికావళి. ఇది చింతామణికి పూరకగ్రంథం. అథర్వణ కారికలకు చింతామణి సూత్రాలకు అతికితేగాని సందర్భక్రమత ఏర్పడదు. అథర్వణ కారికావళిలోని ప్రయోగ ప్రదర్శన ఆరువిధాలు. ఆ ప్రయోగాలు చింతామణి సూత్రాలకు (1) పూరకాలుగానో (2) అపవాదులుగానో (3) సవరణలుగానో (4) వివర

ణలుగానో (5) నిషిద్ధరూపనిర్ణయాలుగానో (6) విశేషాంశగుర్తింపుగానో ఉన్నాయి.

ఉదా: (1) చింతామణి భూతార్థక్రియా పదాలలోని యకారం (చనియెను), పదాదిగత యకారం (యెప్పుడు, యెవ్వడు, యెలను) ఎత్వయుతంగ ఉంటవని, తక్కిన యకారం అత్వోయుత మని సూత్రిం చింది. (సంజ్ఞ. 24) అథర్వణుడు దీనిని పూరిస్తూ ఉయ్యెల, పయ్యెద, తాయెతు అన్న వాటిలోగల పదమధ్య ఎకారాన్ని చూపాడు. (అ. కా. వ. సంజ్ఞ. 24.)

2. ''అనియమాత్ గ్రామ్యమ్'' అన్న చింతామణి అనుశాసనం వలన లక్షణ విరుద్ధమైనది ప్రయోగానర్హమని స్పష్టమవుతుంది. కాని సందర్భౌచిత్యాన్ని బట్టి కొన్నియెడల గ్రామ్యంకూడ ప్రయోగార్హమేనని చింతామణి సూత్రానికి అపవాదుగ 'కఱకంఠ' ప్రయోగాన్ని అథర్వణుడు ప్రదర్శించాడు. (అ.కా.వ. సంజ్ఞ. 29).

3. నమః మొదలైన శబ్దాల తుది విసర్గం అనుకరణలో లోపి స్తుందని చింతామణి. (సంధి 20) నమశ్శబ్ద విసర్గానికి లోపమేకాక ఓత్వం కూడ వస్తుందని అథర్వణుని సవరణ. (సంధి. 13)

4. ఉకారాంత మహద్వాచకాలకు డుజ్వర్ణకం విభాషగ వస్తుందని మాత్రమే చింతామణి (అజం. 44). ఈ విధి ఎట్టి ఉకారాంత పదాలకు వర్తించదో సోదాహరణంగ అథర్వణుడు వివరించాడు. మనువు, వటువు ఆది శబ్దాలకు 'వు' వర్ణకమే గాని, డుజ్వర్ణకము రాదు (అ. కా. వ. అజం. 26) అని అథర్వణుని వివరణ.

5. భవత్, గీర్, యుష్మత్, అస్మత్ ఇత్యాది సంస్కృత శబ్దా లకు ఆంధ్ర భాషలో వ్యస్త ప్రయోగం లేదని నిషేధించాడు (అ.కా.వ. హలం. 2, 3).

6. ఆర్యాంబాద్యర్థక శబ్దాలు స్వయంగానే శ్రేష్ఠతా బోధకాలు కనుక తదంత శబ్దాలపై మరలా శ్రేష్ఠతా వాచకాలు చేరవని విశేషంగ అథర్వణుడు పేర్కొన్నాడు.

ఈ ఆరు విధాలైన ప్రయోగ ప్రదర్శన ఉత్తరోత్తర తెలుగు వ్యాకరణాలలో అనుసరింపబడ్డది. అథర్వణుడు చూపిన లక్ష్యాలు కావ్య ప్రయోగాలుగానే ఉండవచ్చు. కాని వాటి ఆకరాలను అథర్వణుడు చెప్ప లేదు. చింతామణిలోకన్న అథర్వణ కారికావళిలో ప్రయోగ ప్రదర్శన కొంత అధికమే. అయితే అథర్వణుడు ప్రతి సూత్రానికి లక్ష్యాలు చూప లేదు. కనుక సంస్కృత వ్యాకరణ సంప్రదాయాన్ననుసరించి కొన్ని నిపాతరూపాలను, నిషిద్ధ పదాలను, విశేషాంశాలను, ఆకృతి గుణాలను మాత్రం పేర్కొనడమన్నది తెలుగు వ్యాకరణ ప్రయోగ ప్రదర్శనలో ఒక పద్ధతి. ఈ విధానం చింతామణిలో, అథర్వణ కారికావళిలో, సూరి రచించిన సూత్రాంధ్ర వ్యాకరణంలో, ఆంధ్ర శబ్దానుశాసనంలో, శబ్ద లక్షణ సంగ్రహంలో చూడవచ్చు.

6. అథర్వణుని తరువాతివాడు కేతన. పద్యాంధ్ర వ్యాకర్తలలో ఇతడే ఆద్యుడు. ప్రతి లక్షణానికి లక్ష్యాన్ని ప్రదర్శించిన తొలి వ్యాకర్త కూడ కేతనే. కేతన ప్రయోగాలలో స్వీయ లక్ష్యాలే కాకుండ యతి ప్రాస నిబద్ధమైన కావ్య ప్రయోగాలు కూడ ఉన్నాయి. అయితే కేతన కూడ కావ్య ప్రయోగాలకు ఆకరాలను పేర్కొనలేదు. స్వీయ లక్ష్యాలను కేతన విస్తారంగ ఉదాహరించాడు. తత్సమ, తద్భవ, దేశ్య, గ్రామ్యా లను, తత్సమరూపసాధనను, ఆచ్ఛిక బహువచనాలను, అత్వ, ఇత్వ, ఉత్వ, లోపాగమాదేశాది సంధులను, ఔపవిభక్తికాలను, సమాసాలను, తద్ధితాలను, క్రియలను సోదాహరణంగ కేతన ప్రదర్శించాడు. కేతన ఆంధ్రభాషాభూషణంలోని లక్ష్యాలను లెక్కగడితే దాదాపు అయిదు

వందలుంటాయి. ఇలా అనేక ప్రయోగాలను ప్రదర్శించడంవల్లనే కాబోలు కేతన తన వ్యాకరణమే ప్రథమాంధ్ర వ్యాకరణంగ పేర్కొన్నాడు. "మున్ను తెనుఁగునకు లక్షణమెన్నఁడు నెవ్వరును జెప్పరేఁ జెప్పెద" అని చెప్పడంలో కేతన ఉద్దేశం "మున్ను తెనుఁగునకు లక్ష్యము నెన్నఁడు నెవ్వరును జెప్పరేఁ జెప్పెద" అని కావచ్చు. కేతన చూపిన ఈ ప్రయోగాలనే ఉత్తరోత్తర తెలుగు వ్యాకర్తలు గ్రహించి, మరికొన్నింటిని చేర్చడం లేదా వేరే ప్రయోగాలను చూపడం చేశారు.

ఇలా స్వీయ లక్ష్యాలనే కాక కేతన "వాఁడిమయూఖాలు, వేఁడి పయోధారలు, కఱకంఠుఁడు" అన్న భారత ప్రయోగాలను కూడ ఆకరాలు చెప్పకుండ "ముని సుకవీంద్రులు గృతులన్" రచియించారని చూపాడు. (ఆం భా. భూ. 133, 134) కనుక ప్రతి సూత్రానికి ఉదాహరణలను చూపే పద్ధతిని మొదట ప్రవేశపెట్టిన తెలుగు వ్యాకర్త కేతన. ఈ విధానాన్నే తరువాతి వ్యాకర్తలందరూ అనుసరించారు.

7. లక్షణ గ్రంథాల్లోని కావ్యప్రయోగాలకు ఆకరాన్ని కూడ తెలిపిన తొలి తెలుగు వ్యాకర్త కవి చింతామణి కర్త తాతంభట్టు. (15 వ శ.) తాను ఉదాహరించిన కావ్యప్రయోగానికి ఆకరాన్ని చూపే పద్ధతిని ఇతడు కవి చింతామణిలో ప్రవేశపెట్టాడు.

8. "శిష్టానాముక్తౌ సూత్రాణామభావే అనుశాసన కారిణ ఏవ దండనీయాః" అన్న నియమమున్నది గనుక తెలుగు వ్యాకర్తలు కవి ప్రయోగాలను పురస్కరించుకొని, పూర్వ వ్యాకర్తలు సాధించని, గతి కల్పించని వాటికి లక్షణాన్నేర్పరచడం కనిపిస్తుంది. ప్రాచీన వ్యాకర్తలు ఆంధ్ర శబ్ద చింతామణినే ప్రమాణంగ పరిగణించి, అందులోని సామాన్య సూత్రాలకు అపవాదులుగ ఉన్న విశేషాంశాలకు ప్రత్యేక లక్షణాన్ని సమకూర్చారు. ఈ విధానానికి ఆద్యుడు కవిజన సంజీవని కర్తయైన

ముద్దరాజు రామన. (15 వ శ.) కూచిమంచి తిమ్మకవి (18 వ శ.) లక్షణసార సంగ్రహంలో అడిదము సూరకవి (18 వ శ.) కవి సంశయ విచ్ఛేదంలోకూడ ఈ పద్ధతే పాటింపబడింది. తెలుగు వ్యాకరణాన్ని ఎప్పటి కప్పుడు సమగ్రం చేయాలన్న తెలుగు వ్యాకర్తల ప్రయత్నం ఈ వ్యాకర ణాలలో కనిపిస్తుంది. ఈ విషయాన్నే కూచిమంచి తిమ్మకవి ఇలా చెప్పాడు :

క. జగదుపకారార్థము క్రొ
త్తగ లక్షణ లక్ష్యములు వితర్కించి బుధుల్
పొగడఁగఁ గృతిఁజేసెద, నెర
వగు లక్షణసార సంగ్రహాహ్వయ మొనరన్. (ల.సా.సం. 1:8)

9. తెలుగు వ్యాకరణాలు ప్రయోగ శరణాలనటాన్ని సంధి, తత్స మాచ్ఛిక కారక, సమాస, తద్ధిత, క్రియా విషయాలలో నిరూపింప వచ్చును. కూచిమంచి తిమ్మకవి మధ్యమ పురుష క్రియలయం దిత్తునకు సంధి నిత్యమనిన చింతామణి అనుశాసనానికి వికల్పతను ఉపదేశించ డానికి ఈ క్రింది ప్రయోగం కారణం—

మీ రిదె యమునాజ్ఞఁ ద్రోచితిరి యెచ్చట నుండి.
(కవుల షష్ఠము - స.ల.సా.సం. 1:187)

మధ్యమ పురుష క్రియేకారానికి సంధి సంఘటింపని ప్రయోగాలు ప్రాచీన మహాకవుల కావ్యాలలో పెక్కులు కనిపిస్తున్నాయి, శ్రీ రావూరి దొరస్వామి శర్మగారు తమ అముద్రిత ఆంధ్రకవి ప్రయోగ రత్నాకరంలో ఎన్నో ప్రయోగాలను గుర్తించారు. మచ్చుకు—

(i) పలుకవైతివియార్య సంభావనీయ. (భార. శాంతి. 5:281)

(ii) కొడుకులఁబట్టి వధించితివి యాఁడుఁబడుచిది కోడల్
(భాగ. 10 స్కం. పూ. భా. ప. 65)

(iii) బేలవైతివి యీ గుణం బేల నీకు. (పాండురంగ. 3:36)

"క్త్వార్థేతో సభవేత్సదా" (అ.కా. సంధి 6) అన్న అథర్వణుని అనుశాసనాన్ని తిరస్కరిస్తూ "ఇడఁగ వచ్చును ల్యప్పుపై నిత్యసంధి" (క. సం. వి. 1:14) అని క్త్వార్థేకార సంధిని కవి సంశయ విచ్ఛేదకర్త సమ్మతించడానికి కారణం "ఎటిఁగించిపుడే" (ఉద్యోగపర్వము) "చాపము నాకందిమ్మనుడు" అని తిక్కన "చించిచ్చు" అని రాయలు, 'మడిగిచ్చు' అని చేమకూర ప్రయోగించటమే (క. సం. వి. 1 : 15-22).

ఇలాగే ప్రథమ మీది పరుషాలకు గసడదవా దేశాన్ని చింతామణి నిత్యప్రవృత్తిగ విధించినా, కాలక్రమంగ ఈ ఆదేశాన్ని ప్రథమ మీదనే కాక కళలమీదకూడ మహాకవులు ఐచ్ఛికంగ ప్రయోగింపసాగారు. అందు చేత అథర్వణుడు ప్రథమమీద, సంబోధన ప్రథమా విభక్తిమీద అవ్యయాలమీద, అచేతనార్థక శబ్దాలమీద, కర్మధారయ సమాసంలో పరుషాలకు గసడదవలు వికల్పంగ అవుతాయని వివరించాడు. (అ.కా.సంధి 14) ఈ ఆదేశం కొన్నింటిలో నిత్యప్రవృత్తి, కొన్నింట అప్రవృత్తి, కొన్నింట వైకల్పికంగ ఉండటంచేత సూరి దీనికి బహుళతను ఆపాదించాడు. ఇరువది నలుగడాదులవంటి ద్విగుసమాసాలలో దీనికి నిత్యప్రవృత్తి. షష్ఠీతత్పురుష సమాసంలో, క్త్వార్థంలో, తద్ధర్మార్థక విశేషణాలపై దీనికి అప్రవృత్తి.

మా కన్నులు; గోష్ఠి తెరువు. (ష.త.)
గొంతి ముద్దుసేయు కొడుకు; చూచు తలంపు. (త.వి.)
పెల్చనార్చి తన రథంబు. (క్త్వార్థము)
—ఆంధ్ర కవి ప్రయోగ రత్నాకరము.

10. (i) సంస్కృత ఏకాక్షరాలను మొదట ప్రదర్శించినవాడు కేతన. స్త్రీ, ధీ, శ్రీ అన్న మూడింటిని ఉదాహరించాడు (ఆం. భా.

భూ. ప. 32). విన్నకోట పెద్దన 'ప్రీ' అన్న మరొక పదాన్ని చేర్చాడు. బాలసరస్వతి భీ, మా, ఖ్మా అన్న వానిని కలిపాడు. గణపవరపు వేంకట కవి 'జ్యా' అన్న పదాన్ని చేర్చడమే కాకుండ 'రా' అనే ఒక క్రొత్త తత్సమ రూపాన్ని చూపాడు. రై శబ్దానికి తత్సమ రూపాలు 'రై, రో' అన్నవి సార్వత్రికాలు. కాని వ్యవహారంలో నాలుగు రాళ్ళు చేతిలో ఉన్నాయి అని ధనార్థంలో 'రా' ఉపయోగంలో ఉన్నది. "రా. సం.వి. ఆ. శ్రీ" బంగారము, ధనము అని సూర్యరాయాంధ్ర నిఘంటువు ధనార్థంలో 'రా' అనే తత్సమ రూపాన్ని ఇచ్చింది. ప్రయోగాన్ని చూపలేదు.

మండ లక్ష్మీనరసింహ కవి యీ రై శబ్దాన్ని గూర్చి మరికొన్ని విశేషాలకు తెలిపాడు. 'రై' శబ్దానికి 'రయి' అన్న రూపాంతరం సాధువు. అచ్చిక శబ్దాల ఐ, ఔ లకు అయి, అవు వచ్చినట్లు రై శబ్దానికి కూడ వస్తుందని, అది రావణమతంగ ఉద్ధరించాడు. అంతేకాకుండ "సంస్కృతే రే శబ్దరై శబ్దయోరపి ద్రవ్యవాచకత్వా దాంధ్రే తత్స, తజ్జ, దేశ్యేష్యపి రేశబ్దస్యాపి ప్రయోగస్య విద్యమానత్వాత్॥ రేవా, రేవత, రేవతుడు, రేఁడు॥ ఇత్యేవం ప్రయోగాస్య ప్రసిద్ధతయా... ఆంధ్రీయ రేశబ్దస్యాపి మహాకవి ప్రయోగస్య విద్య మానత్వాత్॥ నాచన సోమయాజి కృతే కృష్ణవిలాసే రుక్మిణీ వాక్యం॥

క. నావంటి దాని నెంచక,
నే వంచన సేసిపోయి వృష్ణికులుఁడు స
త్యావనిత యింట నరే,
రేవానలు గురిసెనఁట హరిణనయన వినవే॥ (త్రి.శ.అ పుట 58)

"రో శబ్ద రే శబ్ద రయి శబ్దాస్త్రయోపి రైశబ్దార్థకా ఏవ" అని నొక్కి చెప్పాడు.

ఈ ఏకాక్షరగణంలో అహోబలుడు "భ్రూ" శబ్దాన్ని చూపాడు. సూరి "భా" (కాంతి) శబ్దాన్ని పేర్కొన్నాడు. తెలుగు వ్యాకర్తలందరూ ఏకాక్షరమైన 'గో' శబ్దాన్ని ఉకారాంత పదాలతో చేర్చడం పరిపాటి కాని మల్లాది సూర్యనారాయణశాస్త్రి గారు తమ ఆంధ్ర భాషానుశాసనంలో 'గో' శబ్దాన్ని ఈ గణంలో చేర్చారు. కనుక తెలుగు వ్యాకరణాలు ప్రదర్శించిన ఏకాక్షరాలు స్త్రీ, ధీ, శ్రీ, హ్రీ, భీ, మా, క్ష్మా, జ్యా, రా, భూ, భా, గో- అన్నవి మాత్రమే. స్థలాంతరంలో భ్రూ, రై, గ్లౌ, నౌ, ద్యు, హృత్ శబ్దాలను సాధించారు. వ్యవహారంలో ఏకాక్షరపదాల ఉపయోగం చాల తక్కువ. ఒకటి రెండు పదాలకన్న అధికంగ వినిపించవు. కావ్యాలలో కూడ వాటి ప్రయోగం పరిమితంగనే కనిపిస్తుంది.

తెలుగు వ్యాకరణాలు కావ్యప్రయోగ శరణాలు అనడానికి ఈ ఏకాక్షర గణాన్నే చూపవచ్చు. చింతామణి నుండి ఆంధ్రభాషానుశాసన కర్త మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారి వరకు గల వ్యాకర్తలందరూ ఏకాక్షరానికి హ్రస్వంలేదని అనుశాసించారు. కాని నారాయణీయాంధ్ర వ్యాకరణంలోని (పు. 1957) "ఒక్కచో నేక వర్ణమందును హ్రస్వము చూపట్టు,నయ్యది హృద్యంబుగాదు" (తత్స. సూ. 96) అన్న గాణపత సూత్రము "నింబచ్ఛద భ్రువల్పంబునిక్క"(ఆముక్త. 5:67) "విద్యుచ్చల చాపజ్య" (ఆముక్త. 3.28) అన్న ప్రయోగాల కొరకు ఏర్పడింది.

ఆముక్త మాల్యదకన్న పూర్వకావ్యాలలోనే హ్రస్వరూప ప్రయోగాన్ని ఆంధ్రకవి ప్రయోగ రత్నాకరం గుర్తించింది:

i. హతాను జన్మజ, న్యక్ష్మ నిరుద్ధ (జైమిని భారతం. 6:153).

ii. చాపజ్య (వరాహపురాణం. 11:116)

5)

2. తిక్కన తన నిర్వచనోత్తర రామాయణంలో "ఇంద్రజి" అన్న రూపాన్ని మూడు స్థలాలో ప్రయోగించాడు. (నిర్వ. 1:81; 2;13; 4;18.) ఇంద్రజిత్తు, ఇంద్రజితుఁడు అన్న రూపాలను ప్రయోగించలేదు. తిక్కనను అనుసరించి ఎఱ్ఱన 'ఇంద్రజి' రూపాన్ని వాడాడు (భార. అరణ్య. 7;121).[1] ఈ రూపాన్ని కేతనగాని ఆ తరువాత ప్రాచీన వ్యాకర్తలు గాని గుర్తింపలేదు. దీనిని మొదట గుర్తించి సాధించినవాడు సూరి. 'జగదింద్రజితోర్లో వా, (సం. సూ. ఆం. వ్యా. పుట. 7; బా.వ్యా. తత్స.79). సూరి తరువాత కూచిమంచి వేంకటరాయకవి (సుకవి మనోరంజనము 5:481) తదితర అర్వాచీన కవులు గుర్తించారు.

తిక్కన అనంతరకవులైన రంగనాథ, భాస్కర, మొల్ల, కూచిమంచి తిమ్మకవులు తమ రామాయణాలలో "ఇంద్రజిత్తు-ఇంద్రజితుఁడు-ఇంద్రజితుఁడు" అన్న మూడు రూపాలను ప్రయోగించారు. కనుకనే 17-18. శతాబ్దాలలోని వ్యాకర్తలీ రూపాలకు తమ వ్యాకరణాలలో గతి కల్పించారు.[2]

1. క. ఎంతయు వెసనృపతనూజు నింద్రజి వైవన్.

2. i. సీ॥ మఱితగు నింద్రజితుఁడనంగ నింద్రజిత్తుఁడు నా పరీక్షితుఁ డనఁగ బరీక్షితుఁడన. (గణపవరపు ఆంధ్రకౌముది. పుట. 9.)

ii. సీ॥ జిత్పదంబున కింద్రజిత్తింద్రజిత్తుండు. (కూచిమంచి లక్షణసార సంగ్రహం. 1:21)

iii. సూ. క్వచి దగుణవత్ గుణవత్! క్వచిత్ స్థలే అగుణవద్గణ శబ్దే గుణవత్ స్యాత్! భూభృత్తు-భూభృత్తుఁడు; ఇంద్రజిత్తు - ఇంద్రజిత్తుఁడు. (మంత. ఆంధ్రకౌముది. సూ. 239)

iv. మహాజ్జగదాది గణస్య॥ భూభృత్తుఁడు॥ ఇంద్రజిత్తుఁడు. (మంద. త్రిలింగ శబ్దానుశాసనము. పుట ౬౫)

3. అదంతమై, దీర్ఘపూర్వలోపధంబయిన మహత్తు మీది విభక్తి లకారానికి రేఫం నిత్యంగ వస్తుంది. కాని కొన్ని మారులు ఉచ్చారణ త్వర వలన బాలురు-బాలులు, భూపాలురు-భూపాలులు, సుశీలురు-సుశీలులు అని రేఫక నిరూపాలు వినిపిస్తాయి. లక్ష్మీనరసింహకవి ఈ రేఫాన్ని వికల్పంగ విధించి ఈ వ్యవహార రూపాలను సాధించాడు.

సూ॥ ద్వాదిలోపధాద్బాలో రః పుంసి॥

వృ॥ దీర్ఘాది లకారోపధా శబ్దాత్పరస్య ప్రత్యయ లకారస్య రేఫోవా స్యాత్పుంసి॥ భూపాలులు॥ భూపాలురు॥ సుశీలులు॥ సుశీలురు॥ బాలులు॥ బాలురు॥. (త్రిలింగ శబ్దానుశాసనం. పుట 55-56).

(4) అదంత పుంలింగ మహద్వాచకాలైన "రంగ, లింగ" శబ్దాలు "రామ" శబ్దంలా 'రంగుడు, లింగుడు' అని కావాలి. కాని బసవడు, సంగటు వంటి ఆచ్ఛిక పదాల సాదృశ్యంచేత కాబోలు వీటి అత్వానికి ఉత్వం రావడంలేదు. త్రిలింగ శబ్దానుశాసనం వీటికి లక్షణాన్ని ఏర్పరచింది :—

సూ॥ నాతస్సవృత్

వృ॥ తద్ధితాంతానాం సర్వనామ్నా మహతాంచా తస్సపిపరే
నోత్స్యాత్॥ రంగుడు॥ కుప్పడు॥ ఇతిన॥ (పుట. 57)

సుసర్ల సుబ్రహ్మణ్యం కృత ఆంధ్ర వ్యాకరణ దండాన్వయంలో కూడ (18 వశ.) "అమ హత్తులకున్ను, ఏకాది గణముకున్ను డాప్ వచ్చును. డుజ్ పరమైతే ఉకారము లేదు" మిరియడు.........ఏకాది గణమునకు ఉదాహరణ॥......కామడు॥ రంగడు॥......॥(పుట. 14) అని ఈ విషయాన్ని ప్రస్తావించింది.

"రంగడు, లింగడు అనునవి యసాధువులు. రంగము, లింగమని యమహత్తులుగానే యుండవలయును" (పుట 72) అన్న

కవిజన మండనకర్త వాక్యాలు నిరాధారాలు. తెనాలి రామలింగఁడు సుప్రసిద్ధ నామధేయుఁడు. 'పాండురంగఁడు' వ్యవహారక్షుణ్ణమైన రూపం. 'లింగఁడు' రూపానికి ఆంధ్రకవి ప్రయోగ రత్నాకరంలోని నిర్ధారక ప్రయోగాలు :—

ఉ. లింగనిషిద్ధుఁ గల్వల చెలింగని...విధాతృనా
లింగని రామకృష్ణ కవి లింగని కీర్తి హసించు దిక్కులన్.
(చాటుపద్య మణిమంజరి, పుట. 42)

కూచిమంచి తిమ్మకవి రాజశేఖర విలాసంలో—
క.ఆ, లింగని నొసరఁగఁదా, నాలింగనమునకు, ఢవియు (3:183)

11-(1) తెలుగు వ్యాకరణాలలో అథర్వణకారికావళి నుండి ముక్త లక్షణ కౌముది వరకు "కూఁతు-కూఁతురు" శబ్దాలను గురించిన చర్చ కొనసాగింది. సూరికి పూర్వ వ్యాకర్తలు "కూఁతురు" శబ్దాన్ని గ్రహించి 'రు' వర్ణలోపాన్ని వికల్పంగా విధించారు. సూరికూడ తన శబ్ద లక్షణ సంగ్రహంలో 'కూఁతురు రేఫంబు విభక్తిరా లోపించు' (3:131) అని తన పూర్వ వ్యాకర్తలనే అనుసరించినా, బాల వ్యాకరణంలో మాత్రం మతం మార్చుకున్నాడు. సూరికి పరములో ఉన్న వ్యాకర్తలు 'కూఁతు' శబ్దానికి రువర్ణాన్ని విభాషగ ఘటించారు. కావ్యాలలో ఎక్కడా 'కూఁతు' అనే రూపం వ్యస్తంగ ప్రథమైక వచనంలో కనిపించడం లేదు. ఒక్క సూరి తప్ప, తెలుగు వ్యాకర్త లందరిదీ 'కూఁతురు' విషయంలో ఏకాభిప్రాయమే.

(2) పూర్వ కవులు నిత్యమని విధించిన కార్యాలను అనంతర వ్యాకర్తలు కవి ప్రయోగాల ననుసరించి వైకల్పికాలుగ, బహుళాలుగ నిర్దేశించడం జరిగింది. చింతామణి, అథర్వణాలు కలన్వాదులకు, చేను, పేను, మీనులకు బహుత్వంలో పేర్కొన్న నిత్య విధుల్ని మంద లక్ష్మీ

నరసింహ కవి వైకల్పికం చేశాడు. కలన్వాదులకు చేను, పేను, మీనుల కడ ప్రాయ వికల్పంగ బహుత్వంలో లోపిస్తుందని సూత్రించాడు.

సూ॥ వామాన్వాదేః॥ కుజోస్నేః॥

వృ॥ మాన్వాది గణస్య నువర్ణకన్యకుజ్ వర్ణకో వాస్యాద్బహు వచనే॥

ఉదా॥ మాను॥ మానులు॥ వికల్పే॥ మాకులు॥ తూను॥ తూనులు॥ తూనులు॥
కొలను॥ కొలసులు॥ కొళ్ళకులు॥ ఇత్యాది॥ మాను॥ తూను॥ కొలన్వాది
గణః॥ కించ॥ భట్టుమూర్తి కవికృతే వసుచరిత్రే॥
ముసలి మానుల్గారే॥ ఇతిశ్లేషేపి మానురితి ప్రయోగో
విద్యమానత్వాత్॥ తత్ప్రయోగ స్త్వతి సాధురేవ॥

సూ॥ మీన్వాదేర్వాలుక్॥ మీన్వాది గణస్య నువర్ణకస్య బహువచనే వాలు
క్స్యాత్॥

వృ॥ పూర్వసూత్రావృత్యా బహువిత్యాధ్యాహారః॥

ఉదా॥ మీను॥ మీనులు॥ మీలు॥ మీను॥ చేను॥ పేన్వాది
మీన్వాది గణః॥ చేను॥ చేలు॥ పేను॥ పేలు॥ (పుట. 61)

వైకృత చంద్రికా కర్త కూడ కలన్వాదుల, మీన్వాదుల గణ విష యంలో త్రిలింగ శబ్దానుశాసన కర్తతో ఏకీభవిస్తున్నాడు.

సూ॥ నోఃకుజ్ బహుళమ్.

వృ॥ నువర్ణస్యబహుళం కుజాదేశః స్యాద్ బహువచనే పరే.

ఉదా॥ కెలను-కెలంకులు, బహుళగ్రహణాత్ కెలనులు ఇత్యాదిచ.

సూ॥ లుజ్మీన్వాదేః.

వృ॥ మీన్వాదేర్నువర్ణస్య బహుళం లుక్స్యాద్ బహువచనేపరే.

ఉదా॥ మీను-మీలు-మీనులు- (వైకృత చంద్రిక, అజంతం, సూ-62,63)

12. కారకప్రయోగ ప్రదర్శనలో తెలుగు వ్యాకరణాలలో రెండు విధాలను గుర్తింపవచ్చు. (1) మండ లక్ష్మీనరసింహకవి తప్ప సూరి వరకు గల ప్రాచీన వ్యాకర్తలు సంస్కృత వ్యాకరణ కారక పరిచ్ఛేదాలలోని ప్రయోగాలను యథాతథంగ అనువదించారు. (2) అర్వాచీన వ్యాకర్తలు, అంటే అబ్బాయినాయడు దగ్గరనుండి ఈ విధానాన్ని మార్చి తెలుగు వాక్యాలను ప్రదర్శించారు. ప్రాచీన వ్యాకర్తలు సంస్కృత కారక లక్షణాన్నే చెప్పారు.

"సర్వ విభక్తి స్సంస్కృత తుల్యా" అని ఒకే సూత్రంలో చింతామణి తెలుగు కారకాన్ని నిర్దేశించింది. కారకాన్ని విపులంగ వివరించిన తొలి తెలుగు వ్యాకర్త గణపవరపు వేంకటకవి. ఆయన ఆరు విధాలైన కారకాలను సోదాహరణంగ ప్రదర్శించాడు.

"సూపకారునిచేత అన్నంబు పక్వంబుగాఁ జేయఁబడియెడు.
మూర్ఖశిష్యుఁడు గ్రామమును గూర్చిపోయెను.
గురుఁడు తచ్ఛిష్యుని గ్రామమునుగూర్చి పోఁజేయుచున్నాఁడు
దేవదత్తుఁడు యజ్ఞదత్తు నెఱగొంగడి నడిగెను."

(ఆంధ్ర కౌముది. పుట. 15-17)

అని వేంకటకవి చూపిన వాక్యాలు సంస్కృత వ్యాకరణానుసారులు.

లక్ష్మీనరసింహకవి "కర్మకర్త్రాదికం సమం అస్మిన్ త్రిలింగ శాస్త్రే కర్తృకర్మాదికం సర్వం పాణినీయ-సమంస్యాత్" (త్రిలింగ శబ్దానుశాసనము. పుట. 89) అని పాణినీయాన్నే గ్రహించాలని స్పష్ట పరిచాడు. దురదృష్టవశాత్తు ఈ ప్రకరణం కొంత లుప్తమయినది. ఉన్నంతలో కవి స్వీయోదాహరణలే కనిపిస్తున్నవి.

వైకృత చంద్రిక పాణినీయాన్ని యథాతథంగ ఉద్ధరించింది. ఉదా॥ మాధవం ప్రాణమత్ (పా. 1.4.49)=మాధవునకు ప్రణమిల్లె.

చోరాత్ అబిభేత్ (పా. 2.3.28)=చోరునకు భయపడియె.
చర్మణి ద్వీపిన మహన్ (పా. 2.3.36)=చర్మము నిమిత్తము వ్యాఘ్రముఁజంపెను. (వైకృత చంద్రిక, విభక్తి.సూ-1)

సూరి బాల వ్యాకరణంలో సిద్ధాంత కౌముదిని కొంతవరకు అనువదించాడు. "స్థాల్యా ఓదనం పచతి దేవదత్తః" "దేవదత్తేన పాచయతీ ఓదనం" అన్న వాక్యాలనే సూరి "దేవదత్తుఁడు వంటకమును వండెను" "దేవదత్తునిచేత వంటకము వండఁబడియె" అని అనువదించాడు. ఇట్టివే-

"చోరాద్బిభేతి" "చోరుని వలన భయపడియె" (బా.వ్యా.కారక9) "మోక్షే ఇచ్ఛాస్తి" "మోక్షమం దిచ్ఛగలదు" (బా. వ్యా. కారక 17). దేవదత్తుడు, చైత్రుడు, మైత్రుడు సిద్ధాంత కౌముదినుండి దిగుమతి అయినవారే.

సూరికారకంలోనేకాక తత్సమపరిచ్ఛేదంలోను "అర్థవ దధాతు రప్రత్యయః ప్రాతిపదికమ్" (1-2-45) అన్న పాణినీయప్రాతిపదిక నిర్వచనానికి అనుగుణంగ "డిత్థ" అన్నదానిని, "కృత్తద్ధిత సమాసాశ్చ" అన్న నిర్వచనంలోని సమాసానికి "రాజపురుష" అన్నదానిని ఉదాహరించాడు. ఇవి రెండును సంస్కృత వ్యాకరణోదాహృతులే.

13. వ్యాకర్తలు తెలుగువిభక్తివిరహిత సంస్కృతాంధ్ర సమాసాన్ని వైరిపదంగ నిర్వచించి నిషేధించారు. తెలుగువిభక్తిసహిత సంస్కృతాంధ్రసమాసాన్ని మిశ్రసమాసంగ పరిగణించి అంగీకరించారు. కాని కవులు వైరి, మిశ్రసమాసాలు రెంటిని యథేచ్ఛగ ప్రయోగించడం చేత, వైరిసమాసాలలో కొన్నింటిని అనింద్యగ్రామ్యాలుగా వ్యాకర్తలు గ్రహించారు.

14. వ్యాకణాలలోని యీ ప్రయోగాలు కొంతవరకు ఆయా వ్యాకర్తల ఆత్మీయతనుకూడ వెల్లడిస్తున్నవి. నీరసమైన వ్యాకరణశాస్త్రాన్ని ప్రయోగాలవలన రంజకంగ చేయడానికి వ్యాకర్తలు ప్రయత్నించారు.

'ప్రయోగమూలం వ్యాకరణమ్' అన్న సూత్రాన్ని ప్రస్తావించిన అప్పకవి తను ప్రదర్శించిన ప్రయోగాలకు ఒక ఆనుపూర్విని కల్పించి, పురాణగాథల ప్రసక్తినో, దైవస్తుతినో, లేక అర్థవంతమైన వాక్యాన్నో అందులో స్ఫురింపచేస్తాడు. తేంతస్సంధికి (పదాంతస్వరలోపము)అప్పకవి దైవస్తుతి:

తే॥ సర్వగతుఁడని హరి నెన్ను దుర్వీబుధులు
పరమపురుషునిగాఁ దలఁతురు తపసులు
శ్రుతిమయుండని చెప్పుదు ర్వ్యామిసురులు
బ్రహ్మమనుచు నెఱుఁగ లేర్దనుజవరులు.

(అప్పకవీయము. 5:115).

ఆదేశసరళాలకు ముందున్న ద్రుతానికి బిందువగునని చెప్పడానికి సీతాకళ్యాణాన్నే గానంచేశాడు.

సీ. ధరద్రుతప్రకృతి శబ్దంబులపైఁ బరుషంబులు సెడి సరళంబులకు
ద్రుతములు ఖండబిందువులగు నాపట్టి గాధేయముని వెంటఁగదలి నడిచెఁ
జరణపంకజధూళిఁ జట్టు నాతిగఁజేసె వెసఁడొక్కమనకుండ విల్లువిఱిచె
ధాత్రీతనూభవఁదగ వివాహంబయ్యె గురువైభవంబునఁ బుకికివచ్చె

ఆ. నినకులేంద్రుఁడనఁగ నివియుదాహరణంబులు ...

(అప్పకనీయము. 5:140).

సమాసాలలో ఔప విభక్తికాలకు చెప్పిన లక్ష్యం :-

తే. ఇనుప పెనమునఁ బోసిన మినుపదోసె
అనుప పప్పును జొక్కంపుటెనుప నేయి
యనుచు నిట్లు సమాసంబులందుఁ గొన్ని
పలుకులను నిల్చు నౌప విభక్తికములు. (అప్పకవీయము 5:122)

ఇలా లక్ష్యాలలో పురాణగాథలను కూర్చే పద్ధతిని అప్పకవి ప్రవేశ పెట్టాడు. ఈ విధానాన్ని లక్షణ మంజరికర్తయైన నైషధము తిమ్మకవి అనుసరించాడు. వారు తమ వ్యాకరణాల్లో శైవ, వైష్ణవ భేదాన్ని కూడ ప్రదర్శించారు. రామకథా ప్రశంసలున్న అప్పకవీయం వైష్ణవం. శివకథా. గానమున్న లక్షణమంజరి శైవం. దీనికి గరళ పురీచ్ఛందమన్నది నామాంతరం.

టుగాగమానికి అప్పకవి ఇచ్చిన ఉదాహరణ :-

ఆ. అక్కజంపుటడవి నలకూర్పఖనుక్కు-
మెఱుఁగుటంప మొనను దఱిగివైచెఁ
జిగురుటాకు గోటఁ జిదిమినచాడ్పునఁ
గలకుటసురలులుక గ్రహపకులుఁడు. (5 : 82)

లక్షణ మంజరిలోని లక్ష్యం :-

గీ. కలకుటసురలను కనుఁగొని చులుకుటలుక
మెఱుఁగుటరదంబు గని వారిమీఁద గదిసి
జయముగైకొని సురల రక్షణము (జేసె
గరళపురిధాముఁ డనఁగ...... (పు. 44 ప. 69)

15. సూరి బాల వ్యాకరణంలో తన లక్షణానికి అపవాదులైన ప్రయోగాలను, లేదా తాను సమ్మతింపని వానిని ప్రదర్శించాడు. అత్వ సంధిలో స్త్రీ వాచక తత్సమాలకు సంధి వచ్చిన గంగను కాసె నెలఁతిచ్చె

నన్న ప్రయోగాలను పేర్కొన్నాడు. అనుకరణలో నమశ్శబ్ద తుది అత్తు నకు ఓత్వం వస్తుందని చెప్పి "ఈ కార్యము లాఁతిచో సహితము గనం బడియెడి. గతానుగతికో లోకోయటంచున్" అన్న కళాపూర్ణోదయ (7:110) ప్రయోగమిచ్చాడు.

"అనుకృతిని నిడుదకుం గుఱుచయగునని యొకండు పలికె నది నిరాకరంబు. దుర్బలస్యబలం రాజా యన వినవే" అన్న ప్రయోగ మిచ్చాడు. ఈ అన్నవాడు అప్పకవి. చూపిన ప్రయోగం మనుచరిత్ర లోనిది. (4 : 74).

నౌశబ్దాన్ని నిపతిస్తూ "కొందఱు నావియనియు నా దేశంబగు నంద్రు" అన్నాడు. ఈ అన్న కొందఱెవరన్న జిజ్ఞాస పండితులకు కలుగకపోలేదు. ఆ అన్న కొందఱిలో రావిపాటి గురుమూర్తిశాస్త్రి ఒక్కడు మాత్రమే ఇప్పటివరకు గుర్తింపబడ్డాడు. (శ్రీ రావూరి దొరస్వామి శర్మ, "సూరి బాలవ్యాకరణ రచన". సాహితి 1964 మార్చి 16 - 17 పు.) గురుమూర్తిశాస్త్రి తన తెనుగు వ్యాకరణంలో (1836) "ఔకారాంతమైన నౌశబ్దమునకు తెలుఁగులో ప్ర. ఏ॥ నావ-నావి" (పుట. 58) అని రెండు రూపాలు చూపాడు. కాని గురుమూర్తి శాస్త్రి కన్న పూర్వమే రచింపబడిన ఏ. డి. క్యాంబెల్ వ్యాకరణంలో విశేషతత్సమ రూపాల్లో 'నావి' శబ్దం పేర్కొబడింది. (A Grammar of the Telugu Language. Rule 216, 1816 to 1920) అయితే 'నౌ'కు 'నావి'ని ఆదేశించిన ఆద్యలాక్షణికుడు పుష్పదంతుడని మంద లక్ష్మీనరసింహకవి తేటపరచి లక్ష్యసమన్వితంగ తన త్రిలింగ శబ్దానుశాసనంలో ప్రచర్చించాడు.

సూ॥ నావి పుష్పదంతస్య॥

వృ॥ నౌ శబ్దస్య సంస్కృత సప్తమ్యేకవచన వద్రూపం స్యాత్పుష్ప దంతస్యమతే ॥

ఉదా॥ నావి॥ నావిచేత॥ నావిఁదెచ్చె॥ నావి యెక్కి॥ అథర్వణభారతే॥
ఆరణ్యపర్వణి॥

క. నయమార రాఘవుఁడు నా
వి యెక్కి వడిదాఁటి జాహ్నవీ శైవలినిన్
జయ జయమని వినువీధుల
వియచ్చరులు సన్నుతింప వేడుకతోడన్.

ఇతి యతిస్థానస్థిత స్థిర్థారక ప్రయోగం. కాబట్టి సూరి పేర్కొన్న కొందరిలో ఇప్పటికి ఆద్యుడు పుష్పదంతుడు. ద్వితీయుడు మంద లక్ష్మీ నరసింహకవి. తృతీయుడు విదేశీయుడైన క్యాంబెల్. వీరి తరువాతి వాడే గురుమూర్తిశాస్త్రి.

సూరి ప్రయోగ ప్రదర్శనలో ఇదొక విలక్షణత. లక్షణాన్ని చెప్పిన దెవరు, లక్ష్యాన్ని ప్రయోగించిన దెవరు అన్న ఆకరాలను సూరి తెలుపలేదు.

16. చింతామణికి వ్యాఖ్యను సంతరించిన బాల సరస్వతి, అహోబల పండితుడు మొదలైనవారు చింతామణి సూత్రాలకు వివరణోదాహరణలను సమకూర్చారు. ఈ వ్యాఖ్యాతలనుసరించిన పద్ధతి కొంత భిన్నమైనది. వీరు 'అనుక్తం అన్యతో గ్రాహ్యమ్మ'న్న నియమాన్ని కొంత ఉపయోగించుకొని వివరించారు. ముఖ్యంగా కారక, సమాస పరిచ్ఛేదాలలో ఇది చూడవచ్చు. ఇతరత్ర కూడ వీని ఉపయోగం కనిపిస్తుంది.

అంతస్థాలకు లఘ్వలఘు భేదాలను వివరిస్తూ బాల సరస్వతి "అందు యవలకు సూ. హలిసర్వేషామ్" అను పాణినీయ సూత్రమున రెండు విధములును సూచితములయ్యె. లకారము "లోళః" అను ప్రాకృత వ్యాకరణ సూత్రమందు రెండు విధము లయ్యెనని సూచితమయ్యెను" అని సంస్కృత ప్రాకృత వ్యాకరణ ప్రమాణాలను చూపాడు.

'షష్ఠ్యా ఉతోఽచి సమ్యేద' అన్న చింతామణి సూత్రానికి అర్థము చెప్పుతూ "అగమాదేశాది లక్షణములు శబ్దశాస్త్ర వ్యవహారముననే తెలియునది. 'అనుక్తమన్యవత్' అనెడి ప్రాకృత న్యాయమునను, 'అనుక్తమన్యతో గ్రాహ్యమ్' అనెడి శాస్త్రము చేతను, మమ్ములోని యుకార మకారములకు శబ్దసూత్రములచేత లోపము చేయునది'' అని వివరించాడు.

'అనుక్త మన్యతో గ్రాహ్యమ్'' అన్న న్యాయాన్ని బట్టి తరుచు పాణిని అనుసరణం ఆంధ్ర వ్యాకరణానికున్నది. పాణినీయానుసారము భవచ్ఛబ్దార్థకానికి ప్రథమ పురుష బహువచన క్రియాయోగ మున్నది. దీనిని ఆధారంగా చేసుకొని తిరుపతి వేంకట కవులు-

ఉ. రోసము గల్గినన్ గవివరుల్ మము గెల్వుఁడు గెల్చిరేని మా
మీసము దీసి మీ పదసమీపములందిడి మ్రొక్కఁగాంచుమే.

(చాటుధార)

అన్న చాటువులో ''మీరు గెల్చితిరేని'' అని అనడానికి మారు 'గెల్చిరేని' అన్న ప్రథమ పురుష బహువచన క్రియను సమర్థించారు.

ఆంధ్రకవి ప్రయోగ రత్నాకరం ఇటువంటి మరి రెండు ప్రయోగాలను గుర్తించింది:-

1. మీ,రేమికతంబు నిచ్చటికి నెచ్చగు మచ్చిక నేగుదెంచిరు.ద్దామ
(శతకంఠ రామాయణము. 4:142)

2. మీరలుండిరి. (తిరుపతి వేంకటకవుల పాండవాశ్వమేధము.)

17. తెలుగు వ్యాకర్తలు వ్యావహారిక రూపాలను ప్రదర్శించారా, గ్రహించారా అన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలి.

''ఇహతు ప్రవ్యాహార్యం సఙ్కేతిత సుప్రసిద్ధమేవ పదమ్'' (సంజ్ఞ. 47) అని విధించి చింతామణి ప్రయోగ సిద్ధమైన పదం గ్రామ్య

మైనా గ్రాహ్యమేనని సమ్మతించాడు. బాల సరస్వతి, అప్పకవి దీనిని ఆమోదించారు. సమాసాలలో ఉత్తున కచ్చుపరమైనప్పుడు టుగాగమము రావలసిన సందర్భంలో "లోకే పట్టపేనుగు॥ చిగురాకులు ॥గోరంచు॥ ఇత్యాది ప్రయోగాలు అలక్షణత్వాద్గ్రామ్యా ఏవ ॥అపిచ॥ శిష్ట ప్రయోగ బాహుళ్యాన్నిర్భయేన ప్రయోక్తవ్యా ఏవ"

(త్రిలింగ శబ్దానుశాసనము. పుట. 25)

అని మండ లక్ష్మీనరసింహకవి లక్షణ సహిత వివరణం. టుగాగమం రాకపోవటం లక్షణ విరుద్ధమై గ్రామ్యం అవుతుంది. మహాకవుల ప్రయోగాలను పరిరక్షించడానికి తెనుగు వ్యాకర్తలు లక్షణాలను నడలించారు. శిష్టప్రయోగాలలో బహుళంగ ఉన్నవానిని నిర్భయంగ ప్రయోగింపవచ్చునన్నారు. ఈ కారణంచేతనే అర్వాచీనుడైన ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకర్త గ్రామ్యాన్ని నింద్య గ్రామ్యమని, అనింద్య గ్రామ్యమని రెండుగ విభజించాడు. కవిప్రయుక్తాలై, ప్రసిద్ధాలైన కలకంఠాదులు అనింద్యగ్రామ్యాలు. ఇతరాలు నింద్యగ్రామ్యాలు. ఆర్యవ్యవహారంబు దృష్టంబు గ్రాహ్యమని సూరి సూచించాడు. ఈ హేతువుచేత ఈ క్రింది కవి ప్రయుక్త వ్యావహారిక రూపాలు అనింద్య గ్రామ్యాలవుతున్నాయి. ఈ క్రింది ప్రయోగాలు ఆంధ్రకవి ప్రయోగరత్నాకరం నుండి సంగ్రహితాలు:—

1. *వీటి లోపల నొకమూఁటిచే* (అప్పకవీయము. 1:583)
2. *పందొమ్మిదో ఛందమున* (,, 4:585)
3. *ఇరువై నాలుగు మూళ్లమేర* (కాశీఖండము. 1:53)
4. *ఓరాత్రిన్* (,, 5:189)
5. *నేయి దాచే వానికిన్* (పాండురంగమాహాత్మ్యము 4:275)
6. ఈలాటి (రుక్మాంగద చరిత్ర 3:233)
7. అక్షింతలు (,, 4:89)

8. ప్రింగేవానికి (రుక్మాంగద చరిత్ర 5:27)
9. ఏమిటి కానిక యేటి యేకాదశి (,, 6:104)
10. ఏలాటి చేటు (అచ్చ తెనుగు రామాయణము ఆరణ్య. 46)

ఆంగ్లేయులతోను, వారి వ్యాకరణాలతోను పరిచయం కలిగిన 'రావిపాటి గురుమూర్తి శాస్త్రి, ఉదయగిరి శేషయ్య వ్యావహారిక ప్రయోగాలను తమ వ్యాకరణాలలో ప్రదర్శించారు. అయితే తెలుగు వ్యాకర్తలలో వ్యావహారిక రూపసాధనకు ప్రాధాన్యత నిచ్చినవాడు మండ లక్ష్మీనరసింహకవి. అతని ఆంధ్ర కౌముది, త్రిలింగ శబ్దానుశాసనాలు రెండింటి లోను ఇది చూడవచ్చు.

మం. ల. నరసింహకవి ఆంధ్ర కౌముదిలో నామాదివకారానికి సర్వత్ర లోపాన్ని వికల్పంగ విధించి, వీఁడు- ఈఁడు; వింత- ఇంత; వెనక- ఎనక; వెట్టి- ఎట్టి; విభుఁడు- ఇభుఁడు, విందు- ఇందు మొ॥ రూపాలు చూపాడు. ఆంధ్ర కౌముదిలో విభుఁడు, విందు అన్న తత్సమాలకు కూడ ఈ కార్యం జరుగుతుందని సూచించినా, త్రిలింగశబ్దానుశాసనంలో ఇది కేవలం తాలవ్యాచ్చులతో కూడిన దేశ్యపదాలకే అని పరిమితం చేసాడు.[1]

---

1. (i) సూ. సర్వత్ర వో వాలుక్.
వృ. నామాది వకారస్య సర్వత్ర వికల్పేన లుకస్యాత్.
(ఆం. కౌముది. సంధి. 89)

(ii) సూ. వస్సతాలవ్యస్యచ.
వృ. తాలవ్యాచ్ సహితస్య దేశ్యనామాది వకారస్య చ వాలోపస్స్యాత్.
(త్రిలింగ శబ్దానుశాసనము పుట 2)

భాషాశాస్త్ర వేత్తలు దీనిని శిష్టోచ్చారణ, పామర జనోచ్చారణగ గుర్తించారు.

స్వరసంధిలో వకార లోపాన్ని చూపాడు.[1]
కృష్ణుఁడు + వుండె = కృష్ణుడుండె.
రాముఁడు + వొప్పె = రాముఁడొప్పె.

అయితే ఈ లోపం పద్యాదిలో జరుగదని "వువిద యొకర్తు మేనఁదొడ + వుల్ దగిలించె" అన్న ప్రయోగాన్నిచ్చాడు.

బహువచన రూపాల్లో వాండ్లు, ఆఁడువాండ్లు, విధవవాండ్లు, మగవాండ్లు, దొడ్డవాండ్లు, పెద్దవాండ్లు, వీండ్లు అన్న రూపాలను సాధించాడు.[2]

తుచ్ఛార్థంలో శేషిగాఁడు, కుప్పిగాఁడు, ఉపాధ్యాయిగాఁడు, మల్లిగాఁడు అన్న రూపాలనే కాక 'గాండ్ల' (మణియగాండ్లు) తోడిరూపాలకు లక్షణం ఏర్పరచాడు. వీటికి తుదివర్ణం లోపించి ఓరిశేషిగా, కుప్పిగా, ఉపాధ్యాయిగా, మల్లిగా అన్న రూపాలుకూడ సిద్ధిస్తవని పేర్కొన్నాడు.[3]

"వల్ల, ఉంచి, పంక" అన్న వాటిని పంచమీవిభక్తి ప్రత్యయాలుగ నిరూపించాడు.[4]

---

1. సూ॥ వసౌన్నోష్ఠ్యస్య నామ్నోలుక్.
2. వృ॥ ఓష్ఠ్యప్రాణ సహితస్య నామాని వకారస్య నామ్నః పరతోలుక్స్యాత్॥ నపద్యాదె క్వచిత్, పద్యాదె రోష్ఠ్య ప్రాణపరస్య విస్యక్వచిత్సలె లోపానస్స్యాత్॥
3. జైమిని రామాయణె॥ సీతాకల్యాణె॥ వులిద ... (త్రిలింగ శబ్దానుశాసనము. పుట. 9)
4. i. సూ॥ సు స్లు నుల చేత కొఱకు వల్ల క్వందుప్- (సుస్-లు-ను-ల-చేత-కొఱకు-వల్ల-కు-అందు-సుప ఏతస్యః - ఆంధ్రకౌముది సూ. 117.

పర్యంతార్థంలో 'దాక'ను విధించి, నాదాక, నీదాక, వాండాక, రామునిదాక, ఇంటిదాక, అంతదాక, ఇంతదాక, ఎంతదాక, కొంతదాక, అందాక, ఇందాక, ఎందాక, కొందాక అన్న రూపాలకు ఉపదేశించాడు.[1]

కాలార్థంలో "సేపు" కలుగుతుంది. కొంత సేపు- అంతసేపు- ఇంత సేపు-ఎంత సేపు.[2]

'దాక, సేపు' అన్న వానిని తద్ధితాలుగ పేర్కొన్నాడు.

---

ii. సూ. ఉంచి, కన్న, పట్టి, కంటే, నుండి, వల్ల, వలన, వంకోం డయో (ఉంచి-కన్న-పట్టి-కంటె-నుండి-వల్ల- వలన - వంక - ఉండి) జసిసః- ఏతే పంచమ్యాస్యుః - ఆంధ్రకౌముది. సూ.126

iii. సూ॥ ఉంచుండి కుండా వంక వల్ల వలన పంచమ్యాః ॥
వృ॥ పంచమీ విభక్తేః, ఉంచి, ఉండి, కుండ, వంక, వల్ల, వలను ఏతేస్యుః॥
ఉదా॥ ఇంటి నుంచి వెడలె, వాకిట గుండా పోయె, అమ్మవంక చుట్టము, రామునివల్ల, సీతవలన, ఇత్యాది. (త్రిలింగ శబ్దాను శాసనము. పుట. 65).

1. సూ. దాక పర్యంతే.
వృ. పర్యంతార్థే దాకస్స్యాత్, నాదాక ... పరిమితావంతః, దేశ్యహ్రస్వకిమ్, తదాదిభ్యః పరస్మాత్పరి మిత పదాత్పరతో యావత్తావత్కి యావదర్థేషు దాకస్స్యాదవ్యయేః॥ అంతదాక... లుక్తస్యగురౌ, పర్యంతార్థక దాకపదేపరే పరిమిత పద తకారస్య లుక్స్యాద్వ్రహ్రస్వతేర్మతే॥ అందాక... (అందే పుట. 83)

2. సూ॥ సేపుః॥
వృ॥ కాలేంతాత్ దేశ్యహ్రస్వ కిమితదాది పరస్యాదంతా పరతః కాలార్థే సేపుస్యాత్॥ (అందే. పుట. 83-85)

అందరు వ్యాకర్తలు క్రియలలో కొన్ని వ్యావహారిక రూపాలను సాధించారు. చేతురు, కోతురు ఇత్యాదులు సాధువులా, అసాధువులా అన్న వివాదమున్నది. 'చుదు'లకు తకారం సర్వసమ్మతం. కాని "యుదు" రులకు తకారంతోడి రూపాలు గ్రామ్యాలు, ప్రయోగానర్హాలని నిరసించిన తొలి వ్యాకర్త తాతంభట్టు. తన కవి చింతామణిలో (15 వ శ.) "గ్రామ్యం బక్షర హీనంబగుట యెట్లన్నను - వాపొయ్యా నేమిసేత్తు" (భాషాధికారం ప. 38) అని చేతును గ్రామ్యంగ చూపాడు. కవి చింతామణి అముద్రితం గనుక సూరికన్న ముందు తాతంభట్టు ఈ రూపాన్ని నిరసించినట్లు సూరిలోకం ఎరుగదు.

కాని యిట్టి రూపాలు ప్రాచీన కావ్యాలలో పెక్కులు ప్రయుక్తాలు. అందువలననే గణపవరపు వేంకట కవి తన ఆంధ్ర కౌముదిలో భవిష్య దర్థక ఉత్తమ పురుషక్రియా రూపంగ "చేతురు" అన్న దానిని సంగ్రహించాడు (పుట. 24). త్రిలింగ శబ్దానుశాసనం "చేతురు"ను సాధు రూపంగ సమ్మతించింది.[1]

కవిజనాంజనం "తిఙ్మధ్యనామకాః" అనే చింతామణి సూత్రాన్ని వ్యాఖ్యానిస్తూ "ఘటించితిమి, చేతుము ఇత్యాదులును తిఙ్మధ్య నామకములు" అని వివరించింది. (పుట. 131).

1. సూ॥ యోర్వా॥

వృ.చాంత క్రియాంత్యా దేశీయకారస్య దువర్ణక దకారస్య చహల్ తకారాదేశోచోః పూర్వతో వికల్పేనస్యాత్॥ "చేతురు" "చేయుదురు" "చేతువు" చేయుదువు "వ్రేతువు" వేయుదువు "వ్రేతును" వేయుదుము "డాతుము" "డాయుదుము" ఇత్యాది.

(త్రిలింగ శబ్దానుశాసనము పుట. 189)

రావిపాటి గురుమూర్తిశాస్త్రి చేతుము, తడుతుము రూపనిష్పత్తిని ప్రవర్తించాడు. ఉదయగిరి శేషయ్య 'చేతు'ను గ్రామ్యంగ ఉదాహరించాడు. అబ్బాయి నాయడు ఈ రూపాలను సమ్మతించాడు. సులభ వ్యాకర్త మాత్రం సూరినే అనుసరించి ఇవి అసాధువులన్నాడు. సూరి అనంతర వ్యాకర్తలలో ఆంధ్రభాషాను శాసనకర్త, నారాయణీయాంధ్ర వ్యాకర్త, బాలవ్యాకరణోద్ద్యోతకర్త, ముక్తలక్షణ కౌముదీకారుడు ఈ రూపాల సాధుత్వాన్ని అంగీకరించారు. కనుక తాతంభట్టు, సూరి, సులభ వ్యాకర్త మాత్రమే చేతురిత్యాదులను అసాధువులుగ పరిగణించారు. వ్యాకరణం ప్రయోగ శరణమని గుర్తించిన తదితర వ్యాకర్తలందరూ ఈ రూప సాధుత్వాన్ని సమ్మతించారు.

తెలుగులో 'కొను' ధాతువు అనుప్రయుక్తమయినపుడు ఆత్మనేపది అవుతుంది. 'కొని' స్థానంలో 'క'వర్ణకాన్ని ప్రామాణిక ప్రాచీన కవులు ప్రయోగించారు. అనంతునికాలంనుండి 'కొని'కి 'క'ప్రత్యయ ప్రయోగం కవిలాక్షణిక ప్రయుక్తం.

1. సొంచిది క్షకారము మాడుక (ఛందోదర్పణము 4:124)
2. గరళం బెత్తుక క్రోలం గాదలంచితే (భాస్కర రామాయణము)
3. పుచ్చుక-పూనుక-చూచుక - చేసుక (కేతన దశ కుమార చరిత్ర 2:17; 96,97,98).
4. ఎత్తుక (భాస్కర రామాయణము అర 1:31; 2:102; భాగవతము 10:560; జైమిని భారతము 2;43)
5. పట్టుక, అంటుక (ప్రబంధరాజ వేంకటేశ్వర విజయ విలాసను 236, 293.)

—ఆంధ్ర కవి ప్రయోగ రత్నాకరము.

ఎన్నో వ్యావహారిక రూపాలను సమ్మతించిన త్రిలింగ శబ్దానుశాసనం, రూపాలను అసాధువులని తిరస్కరించడం చోద్యం. లక్ష్మీ

రత్నాకరం ఎత్తిన హరివంశంలో "ముట్టడము" (ఉ. భా. 1:25) అన్న ప్రయోగాన్ని గుర్తించింది. అహోబలునికి పూర్వుడైన గణపవరపు వేంకటకవి అడాంత రూపాలకు కృదంత భావార్థకాలుగా సంగ్రహించాడు; రహితోపడము, కొసరడము, కోరడమన, నలయడము ప్రత్యయ మగు చుఁజను. (ఆంధ్రకౌముది. పుట. 27.) బాలకవిశరణ్యం 16 వ. శతాబ్ది కావ్యాలనుండి అడాంతా ప్రయోగాలను ప్రదర్శించిరది (పుట. 209).

16. వ. శతాబ్దికి చెందిన త్రివిక్రమ వ్యాకరణం (ఇది అము ద్రితం) అడమటాంతాలు భావార్థకాలని సూత్రించి.

గీ॥ కప్పడంబు లదిరె కల్వడంబులు దీరె
పిల్వడములు లేక పెండ్లివారు
రావడంబు లెచటలేవు మీ పోవడ
మింత ప్రొద్దు తట్టలెత్తడమున
అని ఉదాహరించింది. (పుట 49).

వాస్తవానికి భావార్థకాలు కృదంతాలు కనుక త్రిలింగశబ్దాను శాసనం అడాంతాలను కృదంతాలు నిరూపించింది.[1]

రావిపాటి గురుమూర్తి శాస్త్రి 'డము-టము' అంతాలను గ్రామ్యా లుగ పరిగణించటానికి కారణం ఏ. డి. క్యాంబెల్ కావచ్చు. (A.D. Campbell) క్యాంబెల్ తన వ్యాకరణంలో–

1. సూ॥ కర్తవ్యడవత్॥
వృ॥ అమహతి కర్త్రర్థే డచ్ ప్రత్యయస్యాద్ధాతోరంత్యస్య. ఉదా॥ కాయడము॥ కూయడము॥ కోయడము॥ ఆర్థధాతుకాత్వాద్యకారః॥ కొట్టడము॥ విడువడము॥ అలుకడము॥ వినటము॥ ఇత్యాది॥
(పుట. 205).

"The affirmative verbal nown is formed by adding 'ట' to the root of in the *common dialeet*, by adding డము to the infinitive; Thus from కొట్టు Comes కొట్టుట or in the common dialect కొట్టడము the beating.

(A Grammar of the Telugu Language. rule 335).

ఆంధ్ర భాషానుశాసనకర్త ధాతువుకు భావార్థంలో 'అడ' ప్రత్యయాన్ని ఆగమంగ విధించి సూత్రించాడు. ముక్త లక్షణ కౌముది కొన్ని ధాతువులకు మాత్రం సమ్మతించింది. ఇలా అడాంతాల విషయంలో ఆంధ్ర వ్యాకర్తలకు ఏకవాక్యత కుదరలేదు.

లక్ష్మీనరసింహకవి 'చేయుదాము, చూదాము, విందాము, కొట్టుదాము, పోవుదాము, కొట్టుచము, తిందము' అన్న రూపాలను సాధించాడు. కర్మధారయ సమాసంలో ఏ కారం రావడం - అయ్యేవాడు, చూచేరాలు, ఉండే దొర - ప్రాచీనులమతం. కాని యీ రూపాలను కణ్వుడు, రావణుడు, పుష్పదంతుడు నిరాకరించినట్లు త్రిలింగ శబ్దానుశాసనం పేర్కొన్నది.[1]

అధర్వణాచార్యుల మతంలో "చూచుతా వచ్చె, వినుతాపోయె, కనుతాపోయె, కనుతావుండె" వంటి రూపాలు సాధువులు.[2]

ఇలా తెలుగు వ్యాకర్తలు వ్యావహారిక ప్రయోగాలకు గతి కల్పించి సాధించారు.

1. సు॥ ధాతో రేత్రాక్చాం॥
వృ॥ మహదమహతోః పదప్రత్యయేషు పరేస్య ఏత్వాస్యాత్కర్మధారయే ప్రాచామతే॥ (పుట. 195)
2. మతాంతర్యేచుపి॥ శుచ్యర్థే ధాతోరంత్యస్య శుతాస్యాత్॥ చుచూతా॥ కించ॥ చుశిషష్ఠి కళాంధుర్యాధర్వణాచార్యమతే॥ శుతా ప్రత్యయ భావార్థేపి స్యోదతి స్పష్ట ఏవ॥ కనుతా॥ చుచూతా॥ వినుతా॥ ॥ఇత్యాది॥ (త్రిలింగ శబ్దానుశాసనము. పుట 1:9)

18. ప్రసంగ సారాంశము

1. వ్యాకరణాలు ప్రయోగ శరణాలనడాన్ని తెలుగు వ్యాకరణాలు అక్షరాల నిరూపించాయి. "లక్ష్య లక్షణం వ్యాకరణమ్" అన్న సూక్తి తెలుగులో వెలువడ్డ వ్యాకరణాల కన్నింటికి అన్వయిస్తుంది.

2. తెలుగు వ్యాకర్తలు లక్ష్యాలుగ ప్రదర్శించిన ప్రయోగాలు రెండు రకాలు. (1) స్వీయోదాహరణలు (2) కావ్య ప్రయోగాలు. గణ యతి ప్రాస నిబద్ధమై, మార్పుడానికి వీలుపడని శబ్దరూపాలనే ప్రమాణంగ గ్రహించి తెలుగు వ్యాకరణ రచన కొనసాగింది. వ్యాకర్తలు ప్రదర్శించిన కావ్య ప్రయోగాలు సాధారణంగ ఏదో ఒక రకమైన విలక్షణత కలిగినవే. కొందరు సంస్కృత వ్యాకరణోదాహృతలను గ్రహించారు. కావ్యభాషనే వ్యాకరణమన్న భావం కొందరు తెలుగు వ్యాకర్తలు వ్యక్తం చేశారు. గణపవరపు వేంకటకవి "అఖిల ప్రబంధంబు అందలి లక్ష్యము ల్వేర్వేఱ యొక కొన్ని విస్తరింతు "(పుట 3) అని "పరికింపఁ బూర్వ ప్రబంధ ప్రయోగము ల్వివరింతు నొక కొన్ని" (పుట 4) అని స్పష్టపరిచాడు.

3. కొన్ని ఆకృతి గణాల్ని, నిపాత పదాలకు నిషేధ రూపాలను ప్రదర్శించే విధానాన్ని చింతామణి ప్రవేశపెట్టింది. ఇది కొంతవరకు సంస్కృత వ్యాకరణ మర్యాద. విపుల వివరణోదాహరణలుండవు.

4. కొన్ని లక్షణాలకు లక్ష్యాలను చూపే పద్ధతిని అథర్వణుడు ఆరంభించాడు. సూరి సంస్కృత సూత్రాంధ్ర వ్యాకరణం, ఆంధ్ర శబ్దానుశాసనం, శబ్ద లక్షణ సంగ్రహం ఇట్టివి.

5. ప్రతి లక్షణానికి లక్ష్యాన్ని ఇచ్చే విధానాన్ని కేతన (ఆంధ్ర భాషాభూషణం) ప్రవేశపెట్టాడు. విన్నకోట పెద్దన (కావ్యాలంకార చూడామణి) అనంతుడు (ఛందోదర్పణం) అప్పకవి (అప్పకవీయం) ప్రభృతులు ఈ విధానాన్ని ప్రపంచించారు.

6. తాము ప్రదర్శించే కవి ప్రయోగాలకు ఆకరాన్ని పేర్కొనే పద్ధతిని తాతంభట్టు (కవి చింతామణి) ప్రారంభించాడు. ముద్దరాజు రామన (కవిజన సంజీవని) అప్పకవి (అప్పకవీయం) కూచిమంచి తిమ్మకవి (లక్షణసార సంగ్రహము) అడిదము సూరకవి (కవిసంశయ విచ్ఛేదము) మొదలైన ప్రాచీన వ్యాకర్తలు తాము చూపిన కావ్య ప్రయోగాలకు ఆకరాలను చూపారు. ఈ పద్ధతిని చిన్నయసూరి పాటించలేదు. ప్రౌఢవ్యాకర్త, నారాయణీయాంధ్ర వ్యాకర్త, ముక్తలక్షణ కౌముది కర్తలు పాటించారు.

7. విశేష రూపాలను మాత్రం ప్రదర్శించి, కవి ప్రయోగ ప్రమాణాలను చూపి లక్షణాన్ని చెప్పే విధానానికి ఆర్యుడు ముద్దరాజు రామన, కూచిమంచి తిమ్మకవి, అడిదము సూరకవి రామనను అనుసరించారు.

8. ఈ వ్యాకరణాలలోని ప్రయోగాలను పరిశీలించితే వీటిలో వైవిధ్యం గోచరిస్తుంది, పూర్వాపూర్వ లాక్షణికు లొసగిన లక్ష్యాలను ఉత్తరోత్తర వ్యాకర్తలు గ్రహించినా, వారూ పరిశ్రమించి సమకాలీన కావ్య ప్రయోగాలకు గతి కల్పింప ప్రయత్నించడం కనిపిస్తుంది.

9. పూర్వ వ్యాకర్తలు చెప్పిన నిత్య విధులకు వైకల్పికతనో, బహుళతనో ఆపాదించడానికి ప్రయోగాలను చూపారు. కొన్ని లక్షణాలను సవరించడానికి, కొన్నింటిని వివరించడానికి కొన్ని అపవాదులుగ, కొన్ని విశేష రూపాలుగ ఉత్తరోత్తర వ్యాకర్తలు ప్రయోగాలు చూపారు.

10. తెలుగుకు ఇంచుమించు రెండు పందల వ్యాకరణాలున్నాయి. ఇందులో కొన్ని నష్టాలు-కొన్ని భ్రష్టాలు. కొన్ని నామమాత్రావశిష్టాలు. తెలుగు భాషకున్న ఇంత వ్యాకరణ సంపద ఇంకయే ఇతర ద్రావిడ భాషకు లేదు. అయినా తిరుపతి వేంకటకవులు "తెలుగుకున్న వ్యాకరణ దీపము చిన్నది" అని అనడానికి కారణం ఒక్క బాలవ్యాకరణం తప్ప

తదితర వ్యాకరణాలకు ప్రసిద్ధి ప్రచారాలు లేకపోవడమే. వాటి ఉనికికూడ తెలియకుండ అజ్ఞాతంగ, అసూర్యంపశ్యంగ అవి పుస్తక భాండాగారాలలో మగ్గిపోవడం. ఈ కారణంగా తెలుగు వ్యాకరణం అసమగ్రము, కావ్య ప్రయోగాలకు కూడ గతి కల్పింపలేదన్న అపోహకు దారి తీసింది. తెలుగు సూరి లోకం ఇప్పటికయినా మేల్కొని, ఈ ఉన్న తెలుగు వ్యాకరణాలనైనా ఉద్ధరించి, బృహదాంధ్ర వ్యాకరణ నిర్మాణానికి పూనుకోవడం భాషోపకారకము.

ప్రసక్త లక్షణ గ్రంథములు

1. అథర్వణుడు ... అథర్వణ కారికావళి.
2. అప్పకవి ... అప్పకవీయము.
3. కూచిమంచి తిమ్మకవి ... లక్షణసార సంగ్రహము.
4. గణపవరపు వేంకటకవి ... ఆంధ్ర కౌముది.
5. నన్నయ ... ఆంధ్ర శబ్ద చింతామణి.
6. నైషధము తిమ్మకవి ... లక్షణ మంజరి (అముద్రితము)
7. పాణిని ... అష్టాధ్యాయి.
8. మంచెళ్ల వాసుదేవుడు ... వైకృత చంద్రిక.
9. మండ లక్ష్మీనరసింహ కవి ... ఆంధ్ర కౌముది.
10. — ... త్రిలింగ శబ్దానుశాసనము (అముద్రితము).
11. రావూరి దొరస్వామి శర్మ ... ఆంధ్రకవి ప్రయోగ రత్నాకరము (అముద్రితము).
12. వెల్లంకి తాతంభట్టు ... కవి చింతామణి (ముద్రణలో నున్నది).